మీరే చదువరి..
క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి..
ప్రపంచవ్యాప్త వార్తలు చదవండి...

PRGI REGD NO: TGTEL/25/A1385

# నేటి ఈవార్తలు

NETI EVARTHALU దినపత్రిక
www.evarthalu.com

మీరే విలేకరి..
క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి..
మీ ప్రాంతంలోని వార్తలు పంపండి..

గురువారం THURSDAY 26-3-2026 | జగిత్యాల JAGITIAL | పేజీలు: 8 PAGES:8 | వెల రూ.2.00 PRICE: 2.00
సంపుటి: 1 Volume:1 | సంచిక: 266 Issue: 266

26 మార్చి 2026 - గురువారం శ్రీ పరాభవ నామ సంవత్సరం ఉత్తరాయణం - వసంత ఋతువు చైత్ర మాసం - శుక్లపక్షం సూర్యోదయం - ఉ. 6:19 సూర్యాస్తమయం - సా. 6:24 తిథి అష్టమి ఉ. 11:51 వరకు తరువాత నవమి సంస్కృత వారం బృహస్పతి వాసరః నక్షత్రం ఆరుద్ర సా. 4:19 వరకు తరువాత పునర్వసు యోగం శోభన రా. 12:32ం వరకు కరణం బవ ఉ. 11:51 వరకు భాలవ రా. 10:58 వరకు వర్జ్యం తె. 3:52 నుండి తె. 5:24 వరకు దుర్ముహూర్తం ఉ. 10:21 నుండి ఉ. 11:09 వరకు మ. 3:11 నుండి మ. 3:59 వరకు రాహుకాలం మ. 1:52 నుండి మ. 3:23 వరకు యమగండం ఉ. 6:19 నుండి ఉ. 7:49 వరకు గుళికాకాలం ఉ. 9:20 నుండి ఉ. 10:51 వరకు బ్రహ్మముహూర్తం తె. 4:43 నుండి తె. 5:31 వరకు అమృత ఘడియలు ఉ. 6:49 నుండి ఉ. 8:20 వరకు అభిజిత్ ముహూర్తం ఉ. 11:57 నుండి మ. 12:46 వరకు

Published from Jagitial
Circulated to Telangana

# సారా.. సారమ్మ సారా!

## తాగుదాం ఇప్ప పువ్వు సారా
## బతుకుదాం 100 ఏళ్లు భేషుగ్గా
## కావాలి సారా కార్పొరేషన్
## అసెంబ్లీలో ఎమ్మెల్యే అనిరుధ్‌ర్ రెడ్డి

గత కొన్ని రోజులుగా ఇప్ప సారా గురించి కీలక వ్యాఖ్యలు చేస్తున్న కాంగ్రెస్ నేత, జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి.. అన్నట్లుగానే బడ్జెట్ సమావేశాల్లో భాగంగా ఇవాళ శాసనసభలో ఇప్ప పువ్వు సారాపై కీలక వ్యాఖ్యలు చేశారు. ఇప్ప చెట్టుకు 5000 ఏళ్ల చరిత్ర ఉందని తెలిపారు. ఇప్ప పూల నుంచి తయారు చేసిన సారాను తాగితే 100 ఏళ్లు బతుకుతారని వెల్లడించారు. ఇప్ప చెట్టు నుంచి వచ్చే ఉత్పత్తులు మనుషుల ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయని పేర్కొన్నారు.



హైదరాబాద్, మార్చి 25 (ఈవార్తలు): ఇప్ప పువ్వు ఉపయోగం.. దాని ద్వారా గిరిజనులు, ఆదివాసీలకు కలిగే ఆర్థిక ప్రయోజనాలను అసెంబ్లీ సాక్షిగా ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ప్రస్తుతం రాష్ట్రంలో అమ్ముతున్న చీప్ లిక్కర్ వల్ల తెలంగాణ ప్రజల ఆరోగ్యం పాడవుతోందని.. ఇలాంటి విస్కీలు తాగడం వల్ల కనీసం జనం 60 ఏళ్లు కూడా బతకలేని పరిస్థితి నెలకొందని అనిరుధ్ రెడ్డి తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. తన నియోజకవర్గం జడ్చర్ల పరిధిలోని తండాల్లో నివసించే ప్రజలు గతంలో ఇప్ప పూల సారా తాగి 100 ఏళ్ల వరకు ఎలాంటి రోగాలు తరువాయి 2 వ పేజీలో...

# వద్దు ఇందిరమ్మ సారా!

## అసెంబ్లీలో ఇప్ప పువ్వు సారా చిచ్చు
## ఇందిర పేరును ప్రస్తావించిన ఎమ్మెల్యే పైడి
## మంత్రుల తీవ్ర అభ్యంతరం.. గందరగోళం



ఇప్ప పువ్వు సారాపై చర్చలో భాగంగా బీజేపీ ఎమ్మెల్యే పైడి రాకేశ్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు రాష్ట్ర రాజకీయాల్లో తీవ్ర దుమారం రేపాయి. ఇప్ప పువ్వు సారా అంశంపై అసెంబ్లీలో జరిగిన చర్చ సందర్భంగా మాట్లాడిన రాకేశ్ రెడ్డి.. ఇందిరాగాంధీ పేరును ప్రస్తావించడం గందరగోళానికి కారణం అయింది. 'ఇప్ప సారాకు ఇప్ప టకీలా లేదా మరేదైనా పేరు పెట్టండి. కానీ, సారా పథకానికి ఇందిరమ్మ సారా అని మాత్రం పెట్టొద్దు' అని వెటకారం చేశారు. దీంతో ఒక్కసారిగా అధికార పక్షం భగ్గుమన్నది.

హైదరాబాద్, మార్చి 25 (ఈవార్తలు):రాకేశ్ రెడ్డి తీరుపై మంత్రులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మాజీ ప్రధాని ఇందిరాగాంధీని అవమానించారంటూ మండిపడ్డారు. ఆయన వ్యాఖ్యలను మంత్రులు సీతక్క, పొన్నం ప్రభాకర్, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, వాకిటి శ్రీహరి, తప్పుబట్టారు. ఎమ్మెల్యే రాకేశ్ రెడ్డి తాను చేసిన వ్యాఖ్యలకు క్షమాపణలు చెప్పాలంటూ వారు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా జోక్యం చేసుకున్న స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్.. రాకేశ్ రెడ్డి వ్యాఖ్యలను రికార్డుల నుంచి తొలగిస్తున్నట్లు ప్రకటించారు. తాను చేసిన వ్యాఖ్యలు అసెంబ్లీలో తీవ్ర దుమారానికి కారణం కావడంతో రాకేశ్ రెడ్డి క్లారిటీ ఇచ్చారు. తనకు ఇందిరా గాంధీపై గౌరవం ఉందని.. ఆ గౌరవంతోనే ఆమె పేరును పెట్టొద్దని కోరినట్లు చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోనే ఇప్ప పువ్వు సారా తయారీ కేంద్రం ఉండాలని తరువాయి 2 వ పేజీలో...



# 'ఎక్స్‌ట్రా' చేస్తే తాటతీస్తాం

## హోటళ్లు, రెస్టారెంట్లకు కేంద్రం వార్నింగ్

న్యూఢిల్లీ: హోటళ్లు, రెస్టారెంట్లకు కేంద్ర ప్రభుత్వం కీలక మార్గదర్శకాలు జారీ చేసింది. ఎల్పీజీ పేరుతో అదనపు చార్జీలు వసూలు చేయకూడదని స్పష్టం చేసింది. గ్యాస్ -2 వ పేజీలో...



## బంగారం-వెండి ధరలు

| | |
|---|---|
| బంగారం (గ్రాము-24 క్యారెట్స్): | రూ.14,667 |
| వెండి (గ్రాము): | రూ.260 |
| ప్లాటినం (గ్రాము): | రూ.5,961 |



# నా తడాఖా చూపిస్తా

## రేవంత్‌కు నేనేంటో తెలిసేలా చేస్తా
### నొసటితో వెక్కించేలా అధిష్ఠానం తీరు.. అసలు వేం నరేందర్ రెడ్డి ఎవరు?
### ఆయన కాంగ్రెస్ పార్టీకి చేసిందేంటి?.. భగ్గుమన్న మాజీమంత్రి జీవన్ రెడ్డి
### కార్యకర్తల ముందే హస్తం పార్టీకి రాజీనామా.. తరలివచ్చిన మద్దతుదారులు

జగిత్యాల, మార్చి 25 (ఈవార్తలు): కాంగ్రెస్ పార్టీలో నాలుగు దశాబ్దాల రాజకీయ ప్రయాణానికి మాజీ మంత్రి జీవన్ రెడ్డి గుడ్ బై చెప్పేశారు. జగిత్యాలలో ముఖ్య కార్యకర్తల సమావేశంలో పార్టీకి రాజీనామా చేస్తున్నట్టు తెలిపారు. మూడు వేల మందితో కలిసి జీవన్ రెడ్డి.. కాంగ్రెస్‌కు తరువాయి 2 వ పేజీలో...

# బంకులు బంద్

## అనేక చోట్ల 'నో స్టాక్' బోర్డులు.. ప్యానిక్ అవుతున్న ప్రజలు
## డీలర్లకు క్రెడిట్ లేకపోవడమే అసలు లొల్లి!



న్యూఢిల్లీ/హైదరాబాద్, మార్చి 25 (ఈవార్తలు): దేశంలో ఇంధన కొరత లేకున్నా, పుష్కలంగా నిల్వలు ఉన్నాసరే పెట్రోల్ బంకులు మూతపడుతున్నాయి. దేశవ్యాప్తంగా పలు నగరాల్లోని బంకుల్లో "నో స్టాక్" బోర్డులు దర్శనమిస్తున్నాయి. ఒక్కొక్కటిగా బంకులు మూతపడుతుండడం వాహనదారుల్లో భయాందోళనలు రేకెత్తిస్తోంది. దీంతో పెట్రోల్ బంకుల ముందు వాహనాలతో క్యూ కడుతున్నారు. హైదరాబాద్ లోనూ దాదాపు అన్నిచోట్లా బంకుల వద్ద భారీ క్యూలు కనిపిస్తున్నాయి. దేశంలో ఇంధన నిల్వలు పుష్కలంగా తరువాయి 2 వ పేజీలో...

# రేపే కవిత కొత్త పార్టీ!

## శ్రీరామనవమి సందర్భంగా తెలంగాణ ప్రజా జాగృతికి ముహూర్తం

త్వరలోనే కొత్త పార్టీని పెట్టనున్నట్లు ప్రకటించిన కల్వకుంట్ల కవిత.. శుక్రవారం తన పార్టీని ప్రకటించబోతున్నట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. తెలంగాణ ప్రజా జాగృతి పార్టీ నమోదు కోసం అప్లై చేసుకున్న కవిత.. ఆ పేరునే ప్రకటించే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది.

హైదరాబాద్, మార్చి 25 (ఈవార్తలు): ఈ నెల 27వ తేదీన ఉదయం 8 గంటలకు కల్వకుంట్ల కవిత.. తన కొత్త పార్టీని అధికారికంగా ప్రకటించనున్నారని సంబంధిత వర్గాల్లో జోరుగా చర్చ జరుగుతోంది. త్వరలోనే పార్టీ నమోదు ప్రక్రియ పూర్తి కానుండటంతో అధికారికంగా ప్రకటించాలని కవిత నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది. మరోవైపు.. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో తాను సిద్దిపేట నియోజకవర్గం నుంచి పోటీ చేస్తానని ఇప్పటికే ఓ ఇంటర్వ్యూలో కవిత తన మనసులోని మాటను వెల్లడించిన సంగతి తెలిసిందే. అక్కడి నుంచే తన పార్టీ జెండా, గుర్తు, విధివిధానాలను ప్రకటించే అవకాశాలున్నాయి. యువతకు, ఉద్యమకారులకు తాను పెట్టబోయే పార్టీలో ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు కూడా గతంలో కవిత వెల్లడించారు.






# దమ్ముంటే నాపై పోటీ చెయ్

## రేవంత్‌కు హరీశ్ రావు సవాల్

హైదరాబాద్, మార్చి 25 (ఈవార్తలు): ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్ రావు విమర్శల వర్షం కురిపించారు. రేవంత్ రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి అవుతానని పగటి కలలు కంటున్నారని, ఆయన తల్లకిందులుగా తపస్సు చేసినా అది అసాధ్యమని ఎద్దేవా చేశారు. తమ పార్టీకి ఎప్పుడు, ఎలా గోల్ కొట్టాలో బాగా తెలుసని, సమయం వచ్చినప్పుడు బీఆర్ఎస్ సత్తా ఏంటో చూపిస్తామని అన్నారు. రేవంత్ రెడ్డికి దమ్ముంటే వేరే వాళ్లను పంపడం తరువాయి 2 వ పేజీలో...

## విశ్వవాణి




జపాన్‌కు చెందిన ఖగోళ శాస్త్రవేత్తలు ఓ గ్రహశకలంపై ఐదు డీఎన్ఏలను గుర్తించారు. వీటి ఆధారంగా భూమిపై జీవం ఎప్పుడు, ఎలా, ఎక్కడి నుంచి మొదలైందన్నది తెలుసుకోవచ్చని శాస్త్రవేత్తలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.




# ఆర్టీసీ 30% డిస్కౌంట్


## ప్రయాణికులకు బస్ టికెట్లపై రాయితీ.. పెట్రో కొరత వేళ ఆకర్షణీయ పథకం

హైదరాబాద్, మార్చి 25 (ఈవార్తలు): ప్రస్తుతం దేశవ్యాప్తంగానే కాకుండా ప్రపంచవ్యాప్తంగా పెట్రోల్, డీజిల్, గ్యాస్ కొరతపై తీవ్ర ఆందోళనలు వ్యక్తం అవుతున్నాయి. పశ్చిమాసియాలో జరుగుతున్న యుద్ధం కారణంగా.. చమురు సరఫరా నిలిచిపోవడంతో ఈ పరిస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలోనే తెలంగాణ రాష్ట్ర తరువాయి 2 వ పేజీలో...

# అగ్నివీర్లకు 20% రిజర్వేషన్

## కేటాయింపు కోసం రాష్ట్రాలకు షా లేఖ

న్యూఢిల్లీ: అగ్నివీర్లకు వివిధ విభాగాల్లో 20 శాతం ఉద్యోగాలను రిజర్వ్ చేయాలని కేంద్ర హోం మంత్రి అమిత్ షా అన్ని రాష్ట్రాలకు లేఖ రాశారు. ఈ మేరకు లేఖను ముఖ్యమంత్రులకు పంపినట్లు సైనిక్ సంక్షేమ శాఖ డైరెక్టర్ బ్రిగేడియర్ మదన్ షీల్ శర్మ (రిటైర్డ్) తెలిపారు. 2027లో తమ నాలుగేళ్ల పదవీకాలం పూర్తి చేసుకునే వారికి ఆయా రాష్ట్రాల్లో ఉపాధి కల్పించాలని హోం మంత్రి లేఖలో సూచించారు. త్రివిధ దళాల్లో పనిచేసిన వారికిచ్చే తరహాలోనే అగ్నివీర్లకు రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగాలివ్వాలని, ప్రధానంగా ఫారెస్ట్ గార్డులు, పోలీస్ కానిస్టేబుల్, జైలు వార్డెన్లు, ఫైర్‌మెంట్, ఎస్డీఆర్ఎఫ్, మైనింగ్ గార్డులుగా, ప్రత్యేక పోలీసు అధికారులుగా తరువాయి 2 వ పేజీలో...





# 1000 డ్రోన్లతో రష్యా దాడి

## ఉక్రెయిన్‌పై అతిపెద్ద గగనతల దాడి

# రాశి ఫలాలు

26.3.2026

మేషం: చేపట్టిన వ్యవహారాలు సజావుగా సాగుతాయి. స్థిరాస్తి ఒప్పందాలలో పునరాలోచన చేయడం మంచిది. సన్నిహితులతో కీలక విషయాలను చర్చిస్తారు. వృత్తి ఉద్యోగాలలో వివాదాలకు దూరంగా ఉండటం మంచిది. కుటుంబ సభ్యులతో చిన్నపాటి మనస్పర్ధలు ఉంటాయి. వ్యాపారాలు అంతంత మాత్రంగా సాగుతాయి. ఆర్థిక పరిస్థితి గందరగోళంగా ఉంటుంది.

వృషభం: అనుకున్న పనులు వేగవంతంగా పూర్తి చేస్తారు. సోదరులతో వివాదాలను తెలివిగా పరిష్కరించుకుంటారు. వృత్తి ఉద్యోగాలలో నూతన ప్రోత్సాహకాలు అందుకుంటారు. దూర ప్రయాణాలలో జాగ్రత్తగా వ్యవహరించాలి. వ్యాపార ప్రారంభానికి అవరోధాలు తొలగుతాయి. ఆర్థిక లావాదేవీలు ఆశాజనకంగా సాగుతాయి.

మిధునం: వృత్తి వ్యాపారాలలో తీసుకున్న నిర్ణయాలు భవిష్యత్తుకు ఉపయోగపడే విధంగా ఉంటాయి. గృహమున విందు వినోద కార్యక్రమాలు నిర్వహిస్తారు. గృహమున విలువైన పత్రాల విషయంలో అప్రమత్తంగా వ్యవహరించాలి. చేపట్టిన పనుల్లో శ్రమాధిక్యత పెరుగుతుంది. నిరుద్యోగ ప్రయత్నాలలో విజయం సాధిస్తారు.

కర్కాటకం: చిన్ననాటి మిత్రులతో విలువైన సమయాన్ని గడుపుతారు. కుటుంబ పెద్దలతో చిన్నపాటి వివాదాలు ఉంటాయి. చేపట్టిన పనులలో నూతన ప్రణాళికలు అమలుపరచి సకాలంలో పూర్తిచేస్తారు. వ్యాపారాలలో స్వల్ప లాభాలను అందుకుంటారు.

సింహం: వృత్తి ఉద్యోగాల్లో అధికారులతో మాట పట్టింపులు ఉంటాయి. చేపట్టిన పనులు అనుకున్న సమయానికి పూర్తిచేస్తారు. భూ సంబంధిత వ్యాపారస్తులకు కొంత అనుకూల వాతావరణం ఉంటుంది. గృహమున కొందరి ప్రవర్తన ఇబ్బంది కలిగిస్తుంది. దైవ సేవా కార్యక్రమాల్లో పాల్గొంటారు.

కన్య: నూతన వ్యాపారాలు ప్రారంభించిన ఆశించిన లాభాలు అందుకుంటారు. అన్ని రంగాల వారికి అనుకూల ఫలితాలు ఉంటాయి. కుటుంబ వాతావరణం అనుకూలిస్తుంది. వృత్తి ఉద్యోగాల్లో శ్రమకు తగిన గుర్తింపు లభిస్తుంది. దైవ సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు. చేపట్టిన పనులు సకాలంలో పూర్తిచేస్తారు.

తుల: వాహన సంబంధమైన సమస్యలు కలుగుతాయి. స్థిరాస్తి కొనుగోలుకు అవరోధాలు తొలగుతాయి. వృధా ఖర్చులు పెరుగుతాయి. నూతన వస్తు వాహనాలు కొనుగోలు చేస్తారు. కుటుంబమున మీ ఆలోచనలు ఎవ్వరికీ నచ్చవు. ఉద్యోగస్తులకు అదనపు బాధ్యతలుంటాయి. వ్యాపారాలలో స్వంత ఆలోచనలు అమలు పరచడం మంచిది.

వృశ్చికం: శత్రువులపై ఆధిక్యత సాధిస్తారు. రాబడి మార్గాలు సంతృప్తి కరంగా సాగుతాయి. సన్నిహితుల నుండి ఆశ్చర్యకర విషయాలు తెలుస్తాయి. కొన్ని వ్యవహారాలలో జీవిత భాగస్వామి సలహాలు తీసుకుని ముందుకు సాగడం మంచిది. బంధువులతో స్వల్ప వివాదాలుంటాయి. నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశములు లభిస్తాయి.

ధనస్సు: బంధుమిత్రుల నుండి శుభకార్య ఆహ్వానాలు అందుతాయి. వృత్తి, ఉద్యోగాల పరంగా సానుకూల ఫలితాలుంటాయి. రావలసిన సొమ్ము సకాలంలో చేతికి అందుతుంది. గృహమున కొన్ని సంఘటనలు గందరగోళంగా ఉంటాయి. వ్యాపార ప్రారంభమునకు అవరోధాలు అధిగమించి ముందుకు సాగుతారు.

మకరం: ఆదాయానికి మించి ఖర్చులు పెరుగుతాయి. కుటుంబ సభ్యులతో విందు, వినోద కార్యక్రమాల్లో పాల్గొంటారు. ఉద్యోగమున అధికారుల నుండి ప్రశంసలు అందుకుంటారు. నిరుద్యోగులకు చాలాకాలంగా ఎదురుచూస్తున్న అవకాశములు అందుతాయి. దైవ సేవాకార్యక్రమాలకు ధన సహాయం అందిస్తారు.

కుంభం: నూతన కార్యక్రమాలకు శ్రీకారం చుడతారు. చేపట్టిన పనులను ప్రణాళిక బద్ధంగా పూర్తి చేయగలుగుతారు. అన్ని రంగాల వారికీ అనుకూల వాతావరణం ఉంటుంది. సన్నిహితుల నుండి అందిన ఒక వార్త ఉత్సాహం కలిగిస్తుంది. వ్యాపార వ్యవహారాలు అనుకూలంగా సాగుతాయి. ఉద్యోగమున ఉన్నత పదవులు పొందుతారు.

మీనం: దీర్ఘకాలిక ఋణ భారం అధికమౌతుంది. బంధు మిత్రులతో మాటపట్టింపులు ఉంటాయి. కుటుంబ వ్యవహారాలలో కీలక నిర్ణయాలు తీసుకుంటారు. చేపట్టిన పనులలో శ్రమ మరింత అధికం అవుతుంది. ఉద్యోగ విషయమై అధికారులతో చర్చలు అనుకూలించవు. వ్యాపారాలు మందకొడిగా సాగుతాయి.



# సారా.. సారమ్మ సారా!

మొదటి పేజీ తరువాయి

లేకుండా సంపూర్ణ ఆరోగ్యంతో జీవించిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. ఇప్ప పువ్వును టీలో కలిపి తాగడం వల్ల డయాబెటిస్ (షుగర్) బాధితులకు బాగా పనిచేస్తుందని ఆయన వెల్లడించారు. ఇప్ప పువ్వును కేవలం సారా తయారీకి మాత్రమే ఉపయోగించకుండా ఐస్‌క్రీమ్స్, కేక్స్, లడ్డూలు, బిస్కెట్లు వంటి అనేక రకాల ఆహార పదార్థాలను కూడా తయారు చేయవచ్చని ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి సూచించారు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో సుమారు 1.6 లక్షల మంది ప్రజలు.. ఇప్ప పూలను సేకరించడం ద్వారా ఉపాధి పొందుతున్నారని తెలిపారు. అదే సమయంలో మధ్యప్రదేశ్ రాష్ట్రంలో మాండ్ అనే డ్రింక్‌ను బాటిల్ రూ. 800 చొప్పున అమ్ముతూ భారీగా లాభాలు పొందుతున్నారని వెల్లడించారు. ఆయా రాష్ట్రాల్లో రాష్ట్ర ప్రభుత్వాలే వారికి ట్రైనింగ్‌తో పాటు మెషీన్లను కూడా అందిస్తున్నట్లు జడ్చర్ల ఎమ్మెల్యే తెలిపారు. రాష్ట్రంలోని ఆదివాసీలు, ఎస్టీలను ఆర్థికంగా మరింత బలోపేతం చేసేందుకు వారి చేత ఇప్ప పువ్వు సారాను తయారు చేయించేందుకు ప్రత్యేక కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలని ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి అనిరుధ్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. తెలంగాణలో తయారు చేసే ఇప్ప పువ్వు ఉత్పత్తులను దేశ, విదేశాలకు ఎగుమతి చేయడం వల్ల రాష్ట్ర ఖజానాకు కూడా భారీగా ఆదాయం సమకూరుతుందని పేర్కొన్నారు. అదే సమయంలో గిరిజనులకు కూడా మెరుగైన ఉపాధి అవకాశాలు లభిస్తాయని చెప్పారు. బ్రిటిష్ పాలనలో ఇప్ప పువ్వు ఉత్పత్తులపై నిషేధం విధించారని గుర్తు చేసిన ఎమ్మెల్యే.. బ్రిటిష్ పాలకులు విధించిన పాత నిబంధనలను పక్కన పెట్టి.. అత్యాధునిక పద్ధతుల్లో ఇప్ప పువ్వు ఉత్పత్తులను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.



# వద్దు ఇందిరమ్మ సారా!

మొదటి పేజీ తరువాయి

సూచించినట్లు వెల్లడించారు. కాంగ్రెస్ పార్టీ ప్రవేశపెట్టే ప్రతీ పథకానికి ఇందిరమ్మ పేరును పెట్టడం అలవాటు అని.. ఈ నేపథ్యంలోనే కొత్తగా తీసుకువచ్చే ఇప్పసారా పథకానికి మాత్రం ఆమె పేరు పెట్టొద్దని సూచించినట్లు వివరణ ఇచ్చారు. తాను చేసిన సూచనలో ఎలాంటి తప్పు లేదని తెలిపారు. ఇందిరాగాంధీ ఉక్కు మహిళ అని.. ఆమె అంటే తనకు ఎంతో గౌరవమని చెప్పారు. ఆమె కేవలం కాంగ్రెస్ పార్టీ అగ్రనేత మాత్రమే కాదని, భారతదేశ మాజీ ప్రధానమంత్రి కూడా అని వెల్లడించారు. తాను తప్పు చేస్తే క్షమాపణ చెబుతానని, కానీ తన మాటల్లో ఎలాంటి తప్పులేదని రాకేశ్ రెడ్డి అన్నారు. వాళ్లు మాట్లాడిందే ఈ సభలో నడుస్తుందంటే ఎలా అని ప్రశ్నించారు. అసలు గతంలో కొందరు ఇందిరమ్మపై తప్పుగా మాట్లాడితే మొదట ఖండించింది తానే అన్నారు. ఇక్కడి వారు ఎవరూ ఖండించలేదని తెలిపారు. తాను తప్పు మాట్లాడితేనే క్షమాపణ చెబుతానని అన్నారు. ఎలాంటి దురుద్దేశంతో మాట్లాడలేదని స్పష్టం చేశారు. తమను చూస్తు 'తమాషాగా' ఉందా అని అంటున్నారని, ఎందుకు బెదిరిస్తున్నారు, ఏం చేస్తారని రాకేశ్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. తాను చేసిన వ్యాఖ్యలపై సభా కమిటీ వేయాలని ఆయన డిమాండ్ చేశారు. గతంలో ఇదే సభలో ఇష్టారీతిన మాట్లాడిన వారు ఉన్నారని, వారు ఏం చేసినా చెల్లుతుందా అని ప్రశ్నించారు. కొత్తవాళ్లు రాజకీయాల్లోకి వచ్చి, ప్రశ్నించడం కాంగ్రెస్ పార్టీకి బాధగా ఉన్నట్లు ఉందని అన్నారు.



# బంకులు బంద్

మొదటి పేజీ తరువాయి

ఉన్నాయని ఓవైపు కేంద్ర ప్రభుత్వం చెప్తున్నా, క్షేత్రస్థాయిలో బంకులు మూతపడడంతో వాహనదారులు ప్యానిక్ అవుతున్నారు. పెట్రోల్, డీజిల్ కొనుగోలుకు బంకుల ముందు వాహనాలతో బారులు తీరుతున్నారు. అయితే, ఈ పరిస్థితికి ఆయిల్ కంపెనీలు అమలుచేస్తున్న కొత్త నిబంధనే కారణమని అధికారులు చెబుతున్నారు. నిన్న మొన్నటి వరకు ఆయిల్ కంపెనీలు తమ రెగ్యులర్ కస్టమర్లు (బంకుల యాజమాన్యాలు, డీలర్లు) కు క్రెడిట్ సౌకర్యం కల్పించేవి. ముందుగా ఇంధనం పంపించి ఆ తర్వాత డబ్బు వసూలు చేసుకునేవి. ఇప్పటివరకు ఇండియన్ ఆయిల్, భారత్ పెట్రోలియం, హిందుస్థాన్ పెట్రోలియం వంటి సంస్థలు డీలర్లకు 3 నుంచి 5 రోజుల క్రెడిట్ సౌకర్యం కల్పించేవి. దీనివల్ల డీలర్లు ఇంధనం తెప్పించుకున్న తర్వాత డబ్బు చెల్లించే వెసులుబాటు ఉండేది. కానీ, అంతర్జాతీయంగా ముడి చమురు ధరలు పెరగడం, హర్మూజ్ జలసంధి వద్ద ఉద్రిక్తతల కారణంగా కంపెనీలు ఈ క్రెడిట్ విధానాన్ని రద్దు చేశాయి. ఇకపై ఇంధనం కావాలంటే డీలర్లు ముందస్తుగానే నగదు చెల్లించాలని (అడ్వాన్స్ పేమెంట్) కొత్త నిబంధన విధించాయి. ఈ మార్పుతో చాలా మంది డీలర్లు ఒక్కసారిగా పెద్ద మొత్తంలో నగదు చెల్లించలేక ఇంధనం కోసం ఆర్డర్లు పెట్టలేకపోయారు. దీంతో వారి వద్ద ఉన్న నిల్వలు అయిపోగానే బంకులను మూసివేయాల్సి వచ్చింది. ఇదే సమయంలో బంకులు మూతపడుతున్నాయనే వార్త సోషల్ మీడియాలో వ్యాపించడంతో ప్రజలు ఆందోళనకు గురయ్యారు. ట్యాంకులు ఫుల్ చేసుకోవడంతో పాటు క్యాన్లలోనూ ఇంధనం నింపుకోవడానికి ఎగబడటంతో ఉన్నచోట్ల కూడా డిమాండ్ అమాంతం పెరిగి కృత్రిమ కొరత ఏర్పడింది. ఈ విషయంపై స్పందించిన పౌరసరఫరాల శాఖ అధికారులు, రాష్ట్రంలో ఇంధన నిల్వలు పుష్కలంగా ఉన్నాయని స్పష్టం చేశారు. ఇది కేవలం డీలర్లు, కంపెనీల మధ్య చెల్లింపుల సమస్య మాత్రమేనని, ప్రజలు భయపడి ఇంధనాన్ని నిల్వ చేసుకోవద్దని సూచించారు. సరఫరా త్వరలోనే సాధారణ స్థితికి వస్తుందని హామీ ఇచ్చారు.

# నా తడాఖా చూపిస్తా

మొదటి పేజీ తరువాయి

రాజీనామా చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ తీరుపై నిప్పులు చెరిగారు. సీఎం రేవంత్‌పై కూడా సంచలన ఆరోపణలు చేశారు. 'శాసనమండలిలో ఏకైక సభ్యుడిగా నేనే నాయకుణ్ణి, నేనే సభ్యుడిగా పోరాడాను. 1995 ఎన్నికల్లో టీడీపీ గాలిలో కూడా జగిత్యాల స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ గెలిచింది. అది నాటి కాంగ్రెస్ ఐక్యతకు నిదర్శనం. చంద్రబాబు స్వయంగా వచ్చినా, ఎంఐఎం మద్దతిచ్చినా 93 ఎన్నికల్లో 75 శాతం ఓట్లతో నన్ను గెలిపించారు. 2006, 2008 రెండు ఉప ఎన్నికల్లో కూడా నాటి తెలంగాణా ఉద్యమంలో కాంగ్రెస్ అభ్యర్థిగా నన్ను ఏఐసీసీ ఎంపిక చేస్తే జగిత్యాలలో కాంగ్రెస్ పార్టీదే ఆధిక్యం. టీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు పదేళ్లు ప్రతిపక్ష ఎమ్మెల్యేగా, ఎమ్మెల్సీగా కాంగ్రెస్ నుంచి ఒంటిచేత్తో పోరాటం చేశాను. పది స్థానాల్లో పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహించడం అనైతికం. దశాబ్ద కాలంగా చేసిన పోరాటంపై ఆధిపత్యం చెలాయించడమే అవుతుంది. అంతకుముందు ఆధిపత్యం చేసిన వాళ్లే మళ్లీ ఆధిపత్యం చేయడమేంటి?. స్థానిక సంస్థల ఎన్నికల వ్యూహాలపై సమావేశం గాంధీభవన్ లో నిర్వహిస్తే అక్కడికి బీఆర్ఎస్ ఎమ్మెల్యే ఎలా వస్తారు?. పార్లమెంట్ వంటి అత్యున్నత ఎన్నికల్లో ఒక పార్టీలో గెల్చి దానికి రాజీనామా చేయకుండా మరో పార్టీ నుంచి పోటీ చేయడం ఏం సంకేతం ఇస్తుంది?. సరే అభివృద్ధిలో కలిసి వస్తే పర్లేదు కానీ పార్టీ అంతర్గత వ్యవహారాల్లో వారి జోక్యం ఏంటి? మహేష్ కుమార్ గౌడ్, వంశీచందర్ వస్తే ఏంటి పరిష్కారం?. నా అనుచరుడిని నడిబజారులో దారుణ హత్య చేస్తే ఓపిక పట్టాలా?. మాకు జరుగుతున్న అవమానాలు, అన్యాయాలపై ఓపిక పట్టాలా?. ఎందుకు ఓపిక పట్టాలి?. కాంగ్రెస్ అధిష్ఠానం వైఖరి నోటితో నవ్వుతూనే నొసటితో వెక్కిరించే విధంగా సాగింది. శాసనసభ్యుడిగా, మండలి సభ్యుడిగా ఒంటరి పోరాటం చేసిన నేను కనీసం మంత్రి పదవికి అర్హుడిని కాదా?. ఒకనాడు పీసీసీ అధ్యక్షుడి రేసులో ఉన్న నేను ఇవాళ నా హక్కుల కోసం నియోజకవర్గంలో పోరాడాల్సి రావడం ఎంత దౌర్భాగ్యం?. జీవన్ రెడ్డిని తొక్కేయాలనేది ఇవాళ కాంగ్రెస్ యోచన. చంద్రబాబు, కేసీఆర్ పై పోరాటం చేసిన నేను ఇక నుంచి రేవంత్ రెడ్డిపై పోరాటం చేస్తా. ఇంకెంత కాలం ఈ అవమానాలు?. కాంగ్రెస్ పార్టీలో ఇంకెవరూ ఎదుగొద్దని రేవంత్ ఇదంతా చేస్తున్నారా?.

## అధిష్ఠానం పట్టించుకోలేదు.

'ఫిరాయింపుదారులతో పార్టీ నిండిపోయి కాంగ్రెస్ జెండా మోసిన కార్యకర్తలకు అన్యాయం జరిగితే ప్రశ్నించా.. తప్పా..? నలభై ఏళ్ల ప్రస్థానాన్ని తెంపుకోవడం బాధాకరమే. కేసీ వేణుగోపాల్‌కు అంతా తెలుసు. అయినా అధిష్ఠానం పట్టించుకోకుం డా, హ్యూమిలేట్ చేస్తే పార్టీలో ఎలా కొనసాగాలి? పట్టపగలే మార్కెట్ కమిటీ చైర్మన్ కోసం ప్రతిపాదించిన నాయకుడు, నా అనుచ రుడు గంగారెడ్డి దారుణహత్యకు గురికావడం నన్ను తీవ్రంగా కలిచివేసింది.



# 'ఎక్స్‌ట్రా' చేస్తే తాటతీస్తాం

మొదటి పేజీ తరువాయి

కొరతను చూపిస్తూ అదనపు సేవల చార్జీ వసూలు చేస్తే చర్యలు తీసుకుంటామని కేంద్ర వినియోగదారుల పరిరక్షణ అథారిటీ (సీసీపీఏ) హెచ్చరించింది. దేశవ్యాప్తంగా ఎల్పీజీ గ్యాస్ కొరత పేరుతో కొన్ని హోటళ్లు, రెస్టారెంట్లు అదనపు చార్జీలు వసూలు చేస్తున్నట్లు వార్తలు వచ్చాయి. ఈ నేపథ్యంలో సీసీపీఏ స్పందించింది. ఎల్పీజీ గ్యాస్ పేరుతో కొన్నిహోటళ్లు, రెస్టారెంట్లు వినియోగదారుల నుంచి అదనంగా ఛార్జీలు వసూలు చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చినట్లు తెలిపింది. హెల్ప్ లైన్ నెంబర్లకు ఫిర్యాదులు వచ్చాయని, మీడియాలో కూడా వార్తలు వచ్చాయని వెల్లడించింది. మెనూలో పేర్కొన్న ధరలను మాత్రమే వసూలు చేయాలని, అదనంగా ఎలాంటి చార్జీలు ఉండకూడదని స్పష్టం చేసింది.

# అగ్నివీర్లకు 20% రిజర్వేషన్

మొదటి పేజీ తరువాయి

రిజర్వేషన్ కల్పించాలని పేర్కొన్నారు. కాగా, ఇప్పటికే కొన్ని రాష్టాలు, సంస్థలు అగ్నివీర్లకు రిజర్వేషన్ కేటాస్తామని వెల్లడించాయి. ఇందులో హర్యానా అన్ని రాష్ట్రాల కంటే ముందుగా జైలు వార్డెన్, పోలీస్ సహా ఇతర విభాగాల్లో అగ్నివీర్లకు ప్రాధాన్యం ఇస్తామని తెలిపింది. ఉత్తరాఖండ్ ప్రభుత్వం కూడా పోలీసు, ఇతర విభాగాల్లో అగ్నివీర్లకు రిజర్వేషన్లను ప్రకటించింది.

## 'ఎక్స్‌ట్రా' చేస్తే తాటతీస్తాంహోటళ్లు, రెస్టారెంట్లకు కేంద్రం వార్నింగ్

న్యూఢిల్లీ: హోటళ్లు, రెస్టారెంట్లకు కేంద్ర ప్రభుత్వం కీలక మార్గదర్శకాలు జారీ చేసింది. ఎల్పీజీ పేరుతో అదనపు చార్జీలు వసూలు చేయకూడదని స్పష్టం చేసింది. గ్యాస్ కొరతను చూపిస్తూ అదనపు సేవల చార్జీ వసూలు చేస్తే చర్యలు తీసుకుంటామని కేంద్ర వినియోగదారుల పరిరక్షణ అథారిటీ (సీసీపీఏ) హెచ్చరించింది. దేశవ్యాప్తంగా ఎల్పీజీ గ్యాస్ కొరత పేరుతో కొన్ని హోటళ్లు, రెస్టారెంట్లు అదనపు చార్జీలు వసూలు చేస్తున్నట్లు వార్తలు వచ్చాయి. ఈ నేపథ్యంలో సీసీపీఏ స్పందించింది. ఎల్పీజీ గ్యాస్ పేరుతో కొన్నిహోటళ్లు, రెస్టారెంట్లు వినియోగదారుల నుంచి అదనంగా ఛార్జీలు వసూలు చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చినట్లు తెలిపింది. హెల్ప్ లైన్ నెంబర్లకు ఫిర్యాదులు వచ్చాయని, మీడియాలో కూడా వార్తలు వచ్చాయని వెల్లడించింది. మెనూలో పేర్కొన్న ధరలను మాత్రమే వసూలు చేయాలని, అదనంగా ఎలాంటి చార్జీలు ఉండకూడదని స్పష్టం చేసింది.

# 1000 డ్రోన్లతో రష్యా దాడి

### ఉక్రెయిన్‌పై అతిపెద్ద గగనతల దాడి

మాస్కో: ఉక్రెయిన్‌పై రష్యా మరోసారి విరుచుకుపడింది. 24 గంటల్లో ఏకంగా 1,000 డ్రోన్లను ప్రయోగించింది. యుద్ధం మొదలైనప్పటినుంచి ఈ స్థాయిలో గగనతల దాడులు చేపట్టడం ఇదే తొలిసారి. పట్టపగలే దేశంలోని 550కి పైగా ప్రాంతాలను మాస్కో లక్ష్యంగా చేసుకున్నట్లు ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ తెలిపారు. 541 డ్రోన్‌లను తమ దళాలు కూల్చేశాయన్నారు. పలు ప్రాంతాల్లో క్షిపణి దాడులు కూడా జరిగాయన్నారు. ఈ దాడుల్లో ముగ్గురు ప్రాణాలు కోల్పోగా, పదుల సంఖ్యలో ప్రజలు గాయపడ్డారని వెల్లడించారు. ఇవానో-ఫ్రాంకివ్స్క్ ప్రాంతంలోని ప్రసూతి ఆస్పత్రి సమీపంలో చేసిన దాడుల్లో ఓ సైనికుడు, అతడి కుమార్తె మరణించినట్లు జెలెన్‌స్కీ పేర్కొన్నారు. దాడుల్లో వందల సంఖ్యలో నివాస భవనాలు, ప్రభుత్వ కార్యాలయాలు దెబ్బతిన్నాయని వివరించారు. ఇప్పటికైనా ప్రపంచ దేశాలు మాస్కోపై ఆంక్షలు విధించాలని పిలుపునిచ్చారు.

# దమ్ముంటే నాపై పోటీ చెయ్

మొదటి పేజీ తరువాయి

కాకుండా, నేరుగా సిద్దిపేటలో తనపై పోటీకి రావాలని బహిరంగ సవాల్ విసిరారు. వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్ విజయం ఖాయమని, కేసీఆర్ మళ్లీ ముఖ్యమంత్రి అవుతారని ఆయన ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలతో పాటు రైతులను కూడా దారుణంగా మోసం చేసిందని హరీశ్ రావు ధ్వజమెత్తారు. ఎన్నికల హామీలను అమలు చేయడంలో విఫలమైన రేవంత్ సర్కారుపై ఇప్పటికే ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత మొదలైందని ఆయన విశ్లేషించారు. ఇదే సమయంలో నియోజకవర్గాల పునర్విభజన, మహిళా రిజర్వేషన్ల అంశాలపై స్పందిస్తూ, తాము ఈ మార్పులను స్వాగతిస్తున్నామని తెలిపారు. పునర్విభజన వల్ల భవిష్యత్తులో బీఆర్ఎస్ పార్టీకే రాజకీయంగా మేలు జరుగుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. అయితే, కుటుంబ నియంత్రణను పక్కాగా పాటించినందుకు దక్షిణాది రాష్ట్రాలకు సీట్ల కేటాయింపులో, నిధుల్లో అన్యాయం జరగడంపై ఆయన తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. మరోవైపు కాంగ్రెస్‌కు రాజీనామా చేసిన సీనియర్ నేత జీవన్ రెడ్డి బీఆర్ఎస్ పార్టీలోకి వస్తారనే ప్రచారంపై హరీశ్ రావు ఆసక్తికరంగా స్పందించారు. ఆయన వస్తారా లేదా అనేది ఇప్పుడే చెప్పడం కంటే, వేచి చూస్తేనే బాగుంటుందని వ్యాఖ్యానించారు.

# ఆర్టీసీ 30% డిస్కౌంట్

మొదటి పేజీ తరువాయి

రోడ్డు రవాణా సంస్థ (టీజీఎస్ఆర్టీసీ) కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలో పెట్రోల్, డీజిల్ కొరత ఉందన్న వార్తలు నగరవాసులను తీవ్ర భయాందోళనలకు గురి చేస్తున్న వేళ ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణాలు పెంచేందుకు చర్యలు చేపట్టింది. హైదరాబాద్‌లో ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించే ప్రయాణికులకు గుడ్‌న్యూస్ చెప్పింది. హైదరాబాద్ నగర పరిధిలో తిరిగే బస్సుల్లో ఇచ్చే టికెట్లపై 30 శాతం రాయితీ ఇస్తున్నట్లు తెలిపింది. అయితే కేవలం మెట్రో ఏసీ, మెట్రో డీలక్స్ బస్సుల్లో మాత్రమే ఈ 30 శాతం డిస్కౌంట్ వర్తిస్తుందని ప్రకటించింది. 'పెట్రోల్ కష్టాలు పడటం ఎందుకు దండగ.. ఆర్టీసీ బస్సులు ఉండగా' అని ఈ సందర్భంగా ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డి వెల్లడించారు. పెట్రోల్ బంకుల వద్ద కిలోమీటర్ల మేర క్యూ లైన్లలో వేచి చూసి.. అనవసరంగా సమయాన్ని వృథా చేసుకోవద్దని.. సురక్షితంగా ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించాలని ఆర్టీసీ ఎండీ కీలక సూచనలు చేశారు. పెట్రోల్ కష్టాల నుంచి హైదరాబాద్ నగర ప్రజలకు విముక్తి కల్పించడం తోపాటు.. ప్రజా రవాణాను మరింత ప్రోత్సహించేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆర్టీసీ అధికారులు స్పష్టం చేశారు. ప్రస్తుతం హైదరాబాద్ నగరంలో కొన్ని పెట్రోల్ బంకులు మూతపడటం, మిగిలిన పెట్రోల్ పంపుల వద్ద భారీగా వాహనాలు నిలిచిపోవడంతో.. ప్రభుత్వ రవాణాను ఉపయోగించుకోవాలని హితవు పలుకుతున్నారు. బైక్‌లు, కార్లలో ఒక్కరు వెళ్లి పెట్రోల్, డీజిల్‌ను అనవసరంగా వృథా చేయడం కంటే.. ఆర్టీసీ బస్సులు ఎక్కి ఆఫీసులు, పనులకు వెళ్లి.. వాటిని ఆదా చేయవచ్చని సూచిస్తున్నారు. నగరం నలుమూలలకు ఏసీ, డీలక్స్ బస్సులను ఆర్టీసీ నడుపుతోందని.. తాజాగా ప్రకటించిన 30 శాతం డిస్కౌంట్‌ను ప్రయాణికులు అందరూ సద్వినియోగం చేసుకోవాలని ఆర్టీసీ అధికారులు పేర్కొంటున్నారు. ప్రయాణికుల కోసం హైదరా బాద్ నగరంలో ప్రస్తుతం 3200 బస్సులను నడుపుతున్నట్లు ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డి వెల్లడిం చారు. ప్రధాన రూట్లలో బస్సులను మరింత పెంచి.. సకాలంలో నగరవాసులు గమ్యస్థానాలకు చేరుకునేలా ఏర్పాట్లు చేసినట్లు వివరించారు. ప్రయాణికుల రద్దీ పెరిగితే.. అందుకు అనుగు ణంగా డిపోల్లో ఉన్న రిజర్వ్ బస్సులను కూడా నడిపేందుకు ఆర్టీసీ రెడీగా ఉందని స్పష్టం చేశారు.




# అసోసియేషన్ ఎన్నికల్లో అక్రమాలు !

**దొంగ ఓట్లు తొలగించి మళ్లీ ఎన్నికలు పెట్టాలి**

**గాంధీ తాత నగర్ కాలనీ వాసుల డిమాండ్**

ఖైరతాబాద్–హైదరాబాద్, మార్చి 25 (ఈవార్తలు): ఖైరతాబాద్‌లోని గాంధీ తాత నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్ష పదవికి జరిగిన ఎన్నికలు వివాదాస్పదంగా మారాయి. ఓటర్ల జాబితాలో భారీ అక్రమాలు జరిగాయని, అర్హత లేని వారికి ఓట్లు కేటాయించారని కాలనీవాసులు ఆరోపిస్తున్నారు. ఈ వ్యవహారంపై పోలీసు ఉన్నతాధికారులు, జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయంలోనూ ఫిర్యాదులు వెల్లువెత్తాయి. అసలేం జరిగిందంటే.. కాలనీ నిబంధనల ప్రకారం.. సేల్ డీడ్‌లో పేరున్న వ్యక్తికి, వారి భర్త/భార్యకు మాత్రమే (ఇంటికి రెండు ఓట్లు) ఓటు హక్కు ఉంటుంది. అయితే, ఈ నెల 1న జరిగిన ఎన్నికల్లో సేల్ డీడ్‌లో పేరు లేని 25 మందికి అక్రమంగా ఓటు హక్కు కల్పించారని కాలనీవాసులు ఆరోపిస్తున్నారు. 2023–2025 కాలానికి చెందిన చైర్మన్, కన్వీనర్, ప్రెసిడెంట్, వైస్ ప్రెసిడెంట్, జనరల్ సెక్రటరీ, క్యాషియర్, ఎలక్షన్ కమిషనర్ కుమ్మక్కై ఈ తప్పుడు ఓటర్ లిస్టును తయారు చేశారని కాలనీవాసులు పేర్కొంటున్నారు. ఈ ఎన్నికల్లో మాజీ ప్రెసిడెంట్ కరుణాకర్ కేవలం 14 ఓట్ల మెజారిటీతో గెలిచినట్లు ప్రకటించారు. అక్రమంగా చేర్చిన ఓట్లు 25 ఉండటంతో, ఈ గెలుపు చెల్లదని కాలనీవాసులు వాదిస్తున్నారు. మార్చి 11న దీనిపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ లేఖ ఇచ్చినా, అసోసియేషన్ సభ్యులు పట్టించుకోకుండా మార్చి 21న గెలిచిన వ్యక్తితో ప్రమాణ స్వీకారం చేయించడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తమ ఫిర్యాదును పట్టించుకోకపోగా, 'మేము ఇలాగే చేస్తాం, మీరు ఏం చేసుకుంటారో చేసుకోండి' అంటూ నిర్లక్ష్యంగా సమాధానం ఇస్తున్నారని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై ఇప్పటికే ఖైరతాబాద్ పోలీస్ స్టేషన్, ఏసీబీ పంజాగుట్ట, డీసీపీ ఖైరతాబాద్ జోన్, హైదరాబాద్ సిటీ పోలీస్ కమిషనర్, డిస్ట్రిక్ట్ రిజిస్ట్రార్ అధికారులకు ఫిర్యాదు చేసినట్లు వెల్లడించారు. తప్పుడు ఓట్లను వెంటనే తొలగించి, పారదర్శకంగా కొత్త ఓటర్ లిస్టును తయారు చేయాలని, తద్వారా కాలనీలో తిరిగి నూతనంగా ఎన్నికలు నిర్వహించాలని గాంధీ తాత నగర్ కాలనీవాసులు డిమాండ్ చేస్తున్నారు. న్యాయం జరగని పక్షంలో కోర్టును ఆశ్రయించేందుకు సిద్ధం అవుతామని పేర్కొన్నారు.





# ఇండ్లలోనే పరిశ్రమలు!

**కాలుష్యంతో స్థానికుల ఇబ్బందులు.. అధికారులకు తెలిసీ మొద్దు నిద్ర**

**ట్యాక్స్ కట్టకుండానే నిర్వహణ**

**లంచాలతో కానిచ్చేస్తున్న ట్యాక్స్ ఆఫీసర్లు?**

**హైకోర్టు ఆదేశాలు బేఖాతరు**

కవాడిగూడ–సికింద్రాబాద్, మార్చి 25 (ఈవార్తలు): జీహెచ్ఎంసీ సర్కిల్–40 పరిధిలోని బన్సీలాల్‌పేట అరుణ్ జ్యోతి కాలనీ నివాసితులు నరకప్రాయమైన జీవితాన్ని గడుపుతున్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఇండ్ల మధ్యే కొనసాగుతున్న చిన్న పరిశ్రమల(ఇనుప బోల్టుల తయారీ కేంద్రాలు)తో కాలుష్యం బారినపడి స్థానికులు తీవ్ర అనారోగ్య సమస్యలను ఎదుర్కొంటు న్నారు. ఈ తయారీ యూనిట్ల నిర్వాహకులు ఏకంగా రోడ్లపైనే పనులు నిర్వహిస్తుండటంతో రాకపోకలకూ తీవ్ర అంతరాయం కలుగుతోంది. యంత్రాల నుంచి వెలువడే మితిమీరిన శబ్దం, దుమ్ము, వాయు కాలుష్యం కారణంగా కాలనీవాసులు కంటిమీద కునుకు లేకుండా గడుపుతున్నారు. అంతేకాకుండా, భారీ యంత్రాల వైబ్రేషన్ల వల్ల తమ ఇళ్ల గోడలకు బీటలు వారుతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ సమస్యపై పలుమార్లు జీహెచ్ఎంసీ అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేకపోవడంతో, గతంలో బాధితులు హైకోర్టును ఆశ్రయించారు. స్పందించిన న్యాయస్థానం.. నివాస ప్రాంతాల్లో పరిశ్రమల నిర్వహణపై సమగ్ర విచారణ జరిపి, తక్షణ చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించింది. ఇరు పక్షాల వాదనలు విని నిర్ణయం తీసుకోవాలని స్పష్టం చేస్తూ హియరింగ్ నోటీసులు జారీ చేసినప్పటికీ, క్షేత్రస్థాయిలో ఇప్పటివరకు ఎలాంటి మార్పు రాలేదని బాధితులు వాపోతున్నారు. జీహెచ్ఎంసీ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకున్ననాథుడే లేడు. పరిస్థితి ఎంత దయనీయంగా ఉందంటే.. ఓ తయారీకేంద్రం ఉండే ఇంటికి పన్ను కొన్ని రోజుల వరకు కేవలం రూ.65 ఉండటం అధికారుల పనితీరుకు అద్దం పడుతోంది. అదీకాకుండా, రెసిడెన్షియల్ కోసం నిర్వహించాల్సిన ఇంటిని, కమర్షియల్ కోసం వాడుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. ఇంటి నెంబర్లు: 6–6–269/66, 6–6–269/67, 6–6–260/70 కలిగిన ఇండ్లలో 30 ఏళ్లుగా పరిశ్రమ నిర్వహిస్తున్నా జీహెచ్ఎంసీ అధికారులు ఇటువైపు చూస్తున్న దాఖలాలు లేవు. జీఎస్టీ లేదు.. జీహెచ్ఎంసీ ట్రేడ్ లైసెన్స్ లేదు.. సేల్స్ ట్యాక్స్ కూడా లేనట్లు తెలుస్తోంది. ఇల్లీగల్ పరిశ్రమల నిర్వహణపై జీహెచ్ఎంసీ డిప్యూటీ కమిషనర్ పుష్పలతను వివరణ కోరగా.. హైకోర్టు ఆదేశాల మేరకు విచారణ జరిపి, నివేదిక ఆధారంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. హైకోర్టు ఆర్డర్ వచ్చి నాలుగు నెలలు అవుతున్నా, ఇప్పటి దాకా చర్యలు తీసుకోకపోవడం అలసత్వమైతే, ఫిర్యాదు చేస్తే గానీ డిప్యూటీ కమిషనర్ నిద్ర నుంచి తేరుకోకపోవడం గమనార్హం.


## మీరిచ్చే ప్రతి పైసా.. ప్రజాస్వామ్య పరిరక్షణకే!

ఉన్నది ఉన్నట్లు చెప్పే తత్వం..
ఎవరికీ కొమ్ముకాయని పథం..
ప్రజా సమస్యలపై యుద్ధం..
ప్రజా హితమే మా శపథం..
ప్రజాపోరులో మేము సంసిద్ధం..
ఇదే నేటి 'ఈవార్తలు' నైజం!

అక్షరమే అస్త్రంగా, ప్రభుత్వాన్ని సరైన దారిలో నడిపించే శస్త్రంగా, వార్తలను నిక్కచ్చిగా అందిస్తూ సాగుతున్న అలుపెరుగని ప్రయాణం మాది. పాలకుల తప్పులను ఎండగడుతూ, వ్యవస్థలను గాడిలో పెట్టే శక్తిమంతమైన శస్త్రం నేటి 'ఈవార్తలు'. ఎవరికీ తలొగ్గని కలం, న్యాయం కోసం గొంతెత్తే గళం.. మన పత్రిక. నిష్పక్షపాత జర్నలిజం మనుగడ సాగించాలంటే అది ప్రజాబలంతోనే సాధ్యం. మీరు అందించే ప్రతి పైసా ఆర్థిక దన్ను మాత్రమే కాదు, అక్రమాలపై మేము ఎక్కుపెట్టే అస్త్రానికి పదును. ప్రజాసమస్యలపై రాజీలేని పోరాటానికి, నిజాలను నిర్భయంగా చాటిచెప్పడానికి మాతో చేయి కలపండి. సత్యాన్వేషణలో భాగస్వాములుకండి.. ప్రజాస్వామ్య పరిరక్షణలో తోడుగా నిలవండి.

- శ్రావణ్ కుమార్ బొమ్మకంటి, ఎడిటర్

సందేహాలకు 94404 55811 నంబర్‌ను సంప్రదించవచ్చు.


# ప్రియుడి కోసం తల్లి హత్య

**ఇంట్లోనే పూడ్చిపెట్టి 10 నెలలుగా నాటకం**

జవహర్‌నగర్–సికింద్రాబాద్, మార్చి 25 (ఈవార్తలు): హైదరాబాద్ నగరంలో పది నెలల క్రితం జరిగిన ఓ మహిళ హత్య కేసు మిస్టరీ వీడింది. ప్రేమకు అడ్డుచెబుతోందన్న కారణంతో కన్నతల్లినే ఓ కూతురు తన ప్రియుడితో కలిసి హత్య చేసి, మృతదేహాన్ని ఇంట్లోనే పూడ్చిపెట్టిన దారుణ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. సికింద్రాబాద్ జవహర్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కౌకూర్ భరత్‌నగర్‌లో ఈ దారుణం చోటుచేసుకుంది. ఓ బైక్ ఆధారంగా పోలీసులు ఈ కేసును ఛేదించారు. వివరాల్లోకి వెళితే... భరత్‌నగర్‌కు చెందిన అంజు అనే మహిళ పది నెలల క్రితం అదృశ్యమైంది. దీంతో ఆమె పెద్ద కుమార్తె బొల్లారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. మిస్సింగ్ కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. పది నెలలుగా దర్యాప్తు చేస్తున్నా కేసు కొలిక్కి రాకపోవడంతో పోలీసులు దీన్ని సవాలుగా తీసుకున్నారు. ఈ క్రమంలో అంజు చిన్న కుమార్తె ఇషిక, ఆమె ప్రియుడు మౌంటీరాజ్‌పై అనుమానంతో వారిని అదుపులోకి తీసుకుని విచారించారు. వారు వాడిన బైక్ ఈ కేసులో కీలక ఆధారంగా మారినట్లు పోలీసులు తెలిపారు. పోలీసుల విచారణలో ఇషిక అసలు నిజాన్ని అంగీకరించింది. ఇషిక, మౌంటీరాజ్ కొంతకాలంగా ప్రేమించుకుంటున్నారని, సహజీవనం చేయాలని నిర్ణయించుకున్నారని తెలిసింది. అయితే, వీరి ప్రేమ వ్యవహారాన్ని తల్లి అంజు తీవ్రంగా వ్యతిరేకించింది. ప్రియుడిని వదిలేయాలని కూతురిని మందలించింది. దీంతో తమ ప్రేమకు అడ్డుగా ఉందని భావించి, తల్లిని హతమార్చాలని ఇషిక, మౌంటీరాజ్ నిర్ణయించుకున్నారు. పథకం ప్రకారం అంజును దారుణంగా హత్య చేసి, ఎవరికీ అనుమానం రాకుండా మృతదేహాన్ని అదే ఇంట్లో గొయ్యి తీసి పూడ్చిపెట్టారు. ఆ తర్వాత ఏమీ తెలియనట్లు నటిస్తూ, తన అక్కతో కలిసి తల్లి కనిపించడం లేదంటూ పోలీసులకు ఫిర్యాదు చేయించారు. ఈ దారుణ ఘటన బయటపడటంతో పోలీసులు ఇషిక, మౌంటీరాజ్‌లను అరెస్ట్ చేశారు. వారిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. పోలీసులు మెజిస్ట్రేట్ సమక్షంలో మృతదేహాన్ని వెలికితీసే పనులు చేపట్టారు. కేవలం నాలుగు రోజుల పరిచయమైన ప్రియుడి కోసం కన్నతల్లిని కూతురే కిరాతకంగా చంపడం స్థానికంగా తీవ్ర కలకలం రేపింది.

# హైదరాబాద్‌లో రాళ్ల వాన

హైదరాబాద్, మార్చి 25 (ఈవార్తలు): హైదరాబాద్లో పలుచోట్ల భారీ వర్షం కురిసింది. వనస్థలిపురం, హయత్ నగర్, గాయత్రీనగర్, అబ్దుల్లాపూర్‌మెట్ తదితర ప్రాంతాల్లో వడగళ్ల వాన కురిసింది. ఒక్కసారిగా వాతావరణం మారిపోవడంతో ప్రజలు ఎండ వేడిమి నుంచి కాస్త ఉపశమనం పొందారు. ఘట్‌కేసర్, అన్నోజిగూడ, నారపల్లిలో భారీ వర్షం కురుస్తోంది. రంగారెడ్డి జిల్లాలో భారీ నుంచి అతిభారీ వర్షం కురిసే అవకాశం ఉందంటూ వాతావరణ శాఖ రెడ్ అలర్ట్ జారీ చేసింది. నారాయణపేట, వికారాబాద్, హైదరాబాద్, మేడ్చల్, మంచిర్యాల జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది.

# ఫిరాయింపు ఎమ్మెల్యేలకు నోటీసులు

**ఏడుగురికి హైకోర్టు తాఖీదులు**

**మళ్లీ మొదటికొచ్చిన ఫిరాయింపుల వ్యవహారం**




హైదరాబాద్, మార్చి 25 (ఈవార్తలు): తెలంగాణలో పార్టీ ఫిరాయింపుల వ్యవహారం ఒక కొలిక్కి రావడం లేదు. పార్టీ మారినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న 10 మంది ఎమ్మెల్యేల వ్యవహారంలో ఏదో ఒక నిర్ణయం తీసుకోవాలని సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాలతో తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్.. తన నిర్ణయాన్ని ఇటీవలె వెలువరించారు. 10 మంది ఎమ్మెల్యేలు పార్టీ మారినట్లు ఎలాంటి ఆధారాలు లేవని పేర్కొంటూ.. వారిపై అనర్హత వేటు వేయాలంటూ దాఖలైన పిటిషన్లను అన్నింటినీ కొట్టిపారేశారు. అయితే ఈ వ్యవహారం అంతటితో ఆగడం లేదు. స్పీకర్ గడ్డం ప్రసాద్ తీసుకున్న నిర్ణయాన్ని సవాల్ చేస్తూ.. మళ్లీ హైకోర్టులో పిటిషన్లు దాఖలయ్యాయి. ఈ క్రమంలోనే పిటిషనర్లు చేసిన వాదనలను విన్న తెలంగాణ హైకోర్టు.. పార్టీ మారినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న ఏడుగురు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలకు తాజాగా నోటీసులు జారీ చేసింది. అదే సమయంలో స్పీకర్ గడ్డం ప్రసాద్‌కు కూడా నోటీసులు ఇచ్చింది. ఇప్పటికే ఇదే వ్యవహారంలో దానం నాగేందర్‌కు హైకోర్టు నోటీసులు జారీ చేసింది. తాజాగా కాలే యాదయ్య, అరికెపూడి గాంధీ, ప్రకాష్ గౌడ్, పోచారం శ్రీనివాస్ రెడ్డి, బండ్ల కృష్ణమోహన్ రెడ్డి, తెల్లం వెంకట్రావులపై పిటిషన్‌లు దాఖలు అయ్యాయి. పిటిషన్లపై విచారణ జరిపిన హైకోర్టు.. కౌంటర్ దాఖలు చేయాలని ఈ ఏడుగురు ఎమ్మెల్యేలకు ఆదేశాలు ఇచ్చింది. ఈ పార్టీ ఫిరాయింపుల వ్యవహారంలో తదుపరి విచారణను వచ్చే నెల 16వ తేదీకి వాయిదా వేస్తున్నట్లు హైకోర్టు స్పష్టం చేసింది. దీంతో పూర్తి అయిపోయింది అనుకున్న తెలంగాణ పార్టీ ఫిరాయింపుల కేసు మళ్లీ మొదటికి వచ్చింది. మరోవైపు.. ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ కు ఇటీవలే హైకోర్టు నోటీసులు జారీ చేసిన సంగతి తెలిసిందే. బీజేపీ శాసనసభా పక్షనేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ చేపట్టిన హైకోర్టు నోటీసులు ఇచ్చింది. దానం నాగేందర్.. బీఆర్ఎస్ పార్టీ తరపున ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత కాంగ్రెస్ పార్టీలో చేరారని.. ఆ తర్వాత కాంగ్రెస్ పార్టీ బీఫామ్‌పై లోక్‌సభ ఎన్నికల్లో సికింద్రాబాద్ నుంచి పోటీ చేసి ఓడిపోయినట్లు తెలిపారు. అయినప్పటికీ దానం నాగేందర్ పార్టీ మారినట్లు ఆధారాలు లేవని అనర్హత పిటిషన్‌ను స్పీకర్ గడ్డం ప్రసాద్ కొట్టేశారని.. ఈ నేపథ్యంలోనే స్పీకర్ ఇచ్చిన తీర్పును కొట్టేయాలని తన పిటిషన్‌లో ఏలేటి మహేశ్వర్ రెడ్డి హైకోర్టుకు విజ్ఞప్తి చేశారు.

# ఇంకెన్నాళ్లు ఆ రాజకీయం?

**బండి సంజయ్**



కరీంనగర్, మార్చి 25 (ఈవార్తలు): ప్రాంతీయ అసమానతల పేరుతో ఇంకెన్నాళ్లు రాజకీయం చేస్తారని కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ కాంగ్రెస్ ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, ప్రాంతీయ అసమానతల పేరుతో దేశాన్ని విభజించాలని చూస్తున్నారా అని మండిపడ్డారు. దేశభక్తి, జాతీయవాదం మీలో మచ్చుకైనా కనిపిస్తోందా అని ప్రశ్నించారు. తమిళనాడు, కేరళం రాష్ట్రాల్లో కాంగ్రెస్ కూటమి ఓడిపోతుందనే ఆందోళన వారిలో మొదలైనట్లుగా ఉందని అన్నారు. త్వరలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న రాష్ట్రాల్లో కాంగ్రెస్ పార్టీ ఎన్ని జిమ్మిక్కులు చేసినా పారడం లేదని ఎద్దేవా చేశారు. అందుకే దక్షిణాదికి అన్యాయం అంటూ కాంగ్రెస్ వారు కొత్త డ్రామా ఆడుతున్నారని ధ్వజమెత్తారు. రేవంత్ రెడ్డికి, కాంగ్రెస్ పార్టీకి మహిళలంటే ద్వేషమని బండి సంజయ్ ఆరోపించారు. అందుకే దేశాన్ని సుదీర్ఘంగా పాలించిన కాంగ్రెస్ మహిళలకు 33 శాతం సీట్లు కేటాయించలేదని అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్ని కుట్రలు చేసినా మహిళలకు రిజర్వేషన్లు అమలు చేస్తామని అన్నారు. మహిళలకు 33 శాతం సీట్లు ఇస్తే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి వచ్చిన నష్టమేమిటని ప్రశ్నించారు.

**పెట్రోల్ కొరత లేదు**

గత కొన్ని రోజులుగా తెలంగాణను కుదిపేస్తున్న పెట్రోల్ కొరత వార్తలపై కేంద్ర మంత్రి బండి సంజయ్ స్పందించారు. పశ్చిమాసియా యుద్ధం వల్ల భారత్‌లో, ముఖ్యంగా తెలంగాణలో ఇంధన నిల్వలు అయిపోయాయనే ప్రచారంలో ఏమాత్రం నిజం లేదని ఆయన స్పష్టం చేశారు. ఇండియన్ ఆయిల్, హిందుస్థాన్ పెట్రోలియం, భారత్ పెట్రోలియం వంటి ప్రభుత్వ రంగ సంస్థల వద్ద దేశ అవసరాలకు సరిపడా స్టాక్ అందుబాటులో ఉందని, కేంద్ర ప్రభుత్వం నిరంతరం దీనిని పర్యవేక్షిస్తోందని బండి సంజయ్ తెలిపారు. సోషల్ మీడియాలో వస్తున్న పుకార్లను నమ్మి అందరూ ఒక్కసారిగా బంకుల వద్దకు 'ఫుల్ ట్యాంక్' కోసం క్యూ కట్టడం వల్లే తాత్కాలికంగా స్టాక్ అయిపోతోందని, ఇది 'కృత్రిమ కొరత' మాత్రమేనని ఆయన విశ్లేషించారు. ఇదే అదనుగా భావించి పెట్రోల్, డీజిల్‌ను నిల్వ చేసి బ్లాక్ మార్కెట్‌లో విక్రయించాలని చూసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అంతర్జాతీయంగా నెలకొన్న చమురు సంక్షోభాన్ని ఎదుర్కోవడానికి ప్రధాని మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం అన్ని ముందస్తు చర్యలు తీసుకుందని, సరఫరాలో ఎలాంటి అంతరాయం ఉండబోదని భరోసా ఇచ్చారు.

## ట్యాంకర్ల ఆలస్యం వల్లే 'నో స్టాక్' బోర్డులు

**మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వివరణ**



హైదరాబాద్, మార్చి 25 (ఈవార్తలు): ట్యాంకర్లు సకాలంలో రాకపోవడం వల్లే బంకుల్లో నో స్టాక్ బోర్డులు వెలిశాయని, గృహ అవసరాలకు గ్యాస్ సరఫరాలో ఎలాంటి ఇబ్బందిలేదని తెలంగాణ రాష్ట్ర మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. పెట్రోల్, డీజిల్ లభ్యత విషయంలో ప్రజలు అపోహలను నమ్మవద్దని కోరారు. చమురు కంపెనీలు కూడా సరిపడా నిల్వలు ఉన్నట్లు చెబుతున్నాయని అన్నారు. అసెంబ్లీలో ఆయన మీడియాతో పిచ్చాపాటిగా మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రంలో 2 నెలలకు సరిపడా ఇంధన నిల్వలు ఉన్నాయని మంత్రి తెలిపారు. వదంతుల కారణంగా పెట్రోల్, డీజిల్ ఎక్కువగా కొనుగోలు చేయడంతో బంకుల్లో రద్దీ నెలకొందని అన్నారు. క్యాన్లు, కంటైనర్లలో ఇంధనాన్ని తీసుకువెళ్లడం చట్టవిరుద్ధమని, అలా చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గృహ అవసరాలకు గ్యాస్ కొరత లేదని స్పష్టం చేశారు. అదే సమయంలో హాస్టళ్లు, ఆసుపత్రులకు గ్యాస్ కొరత లేకుండా పర్యవేక్షిస్తున్నట్లు చెప్పారు. హైదరాబాద్ నగరంలో 596 పెట్రోల్ బంకులు పూర్తిగా పని చేస్తున్నాయని మంత్రి వెల్లడించారు. ఏ బంకును కూడా మూసివేయడానికి అనుమతించలేదని అన్నారు. కమర్షియల్ సిలిండర్ల విషయంలో కేంద్రంతో మాట్లాడుతున్నట్లు మంత్రి తెలిపారు. చట్టవిరుద్ధంగా నింపిన 2,952 కమర్షియల్ సిలిండర్లను అధికారులు స్వాధీనం చేసుకున్నట్లు మంత్రి తెలిపారు.

## హైదరాబాద్‌పై బాంబ్ పడితే ఎట్లా?

**అభివృద్ధి అంతా నగరంలోనేనా?.. అసెంబ్లీలో కూనంనేని సంచలన వ్యాఖ్యలు**

హైదరాబాద్, మార్చి 25 (ఈవార్తలు): అభివృద్ధి అంతా హైదరాబాద్‌లోనే కేంద్రీకృతమైందని, దానిని అన్ని జిల్లా కేంద్రాలకు విస్తరించాలని సీపీఐ శాసనసభ్యుడు కూనంనేని సాంబశివరావు ప్రభుత్వాన్ని కోరారు. "ఇప్పుడు యుద్ధాల కాలం నడుస్తోంది. ఎవరైనా హైదరాబాద్‌పై ఒక్క బాంబు వేస్తే నగరం మొత్తం నాశనమవుతుంది" అని ఆయన అసెంబ్లీలో సంచలన వ్యాఖ్యలు చేశారు. బడ్జెట్‌పై జరిగిన చర్చలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ విధానాలపై తీవ్ర స్థాయిలో విమర్శలు చేశారు. హైదరాబాద్‌లో ఐటీ రంగంపై ప్రభుత్వ నియంత్రణ లేకపోవడంతో కంపెనీలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాయని కూనంనేని ఆరోపించారు. ఉద్యోగులకు ఉద్యోగ భద్రత లేకుండా పోయిందని, కంపెనీలు వారి రక్తం పీలుస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. మరోవైపు, సింగరేణి, ఆర్టీసీలను ప్రైవేటుపరం చేసే ఆలోచన కనిపిస్తోందని అన్నారు. సింగరేణిలో బొగ్గు సేకరణ, ఆర్టీసీలో ఎలక్ట్రిక్ బస్సుల నిర్వహణను ప్రైవేటుకు అప్పగిస్తున్నారని విమర్శించారు. గతంలో జలయజ్ఞం పేరుతో ప్రారంభమైన నీటిపారుదల ప్రాజెక్టులు పాలకులకు ఏటీఎంలుగా మారాయని కూనంనేని అన్నారు. రాష్ట్రంలోని ప్రాజెక్టులు పూర్తి కావాలంటే రూ. 2 లక్షల కోట్లు అవసరం కాగా, బడ్జెట్‌లో కేవలం రూ. 22,966 కోట్లు మాత్రమే కేటాయించారని గుర్తుచేశారు. ఇదే చర్చలో బీఆర్ఎస్ ఎమ్మెల్యే వివేకానంద మాట్లాడుతూ.. కాళేశ్వరం ప్రాజెక్టు రైతులకు మేలు చేసేదని, దానిపై విమర్శలు చేయవద్దని కోరారు. కాంగ్రెస్ ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు మాట్లాడుతూ ప్రభుత్వ లక్ష్యాలన్నీ ఆచరణ సాధ్యమేనని విశ్వాసం వ్యక్తం చేశారు.



## భట్టి విక్రమార్కతో కేటీఆర్ భేటీ

**నేతన్నలను ఆదుకోవాలని విజ్ఞప్తి**

హైదరాబాద్, మార్చి 25 (ఈవార్తలు): సిరిసిల్ల వస్త్ర పరిశ్రమను పట్టిపీడిస్తున్న సంక్షోభం నుంచి నేతన్నలను గట్టెక్కించేందుకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చొరవ తీసుకున్నారు. బుధవారం డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కను కలిసిన ఆయన, సిరిసిల్ల నియోజకవర్గంలోని పవర్ లూమ్ పరిశ్రమ ఎదుర్కొంటున్న ఆర్థిక ఇబ్బందులను వివరించారు. రాజకీయాలకు అతీతంగా జరిగిన ఈ భేటీ అందరినీ ఆకట్టుకుంటోంది. సిరిసిల్ల వస్త్ర పరిశ్రమపై ఉన్న సుమారు రూ. 38 కోట్ల విద్యుత్ బకాయిలు, పేరుకుపోయిన బ్యాక్ బిల్లింగ్, సర్‌ఛార్జ్‌లను తక్షణమే మాఫీ చేయాలని కేటీఆర్ ఈ సందర్భంగా డిప్యూటీ సీఎంను కోరారు. గత ప్రభుత్వ హయాంలో ఉన్న విధంగానే పరిశ్రమకు నిరంతర విద్యుత్ సబ్సిడీ ప్రయోజనాలు అందేలా చూడాలని, పాత బకాయిలతో సంబంధం లేకుండా నేతన్నలకు వెసులుబాటు కల్పించాలని విన్నవించారు. పరిశ్రమ సంక్షోభంలో ఉండటంతో నేతన్నలు మళ్ళీ ఆత్మహత్యల బాట పట్టే ప్రమాదం ఉందని, వారికి తక్షణమే భరోసా ఇవ్వాల్సిన అవసరం ఉందని కేటీఆర్ తెలిపారు. కేటీఆర్ వివరించిన సమస్యలపై డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సానుకూలంగా స్పందించారు. నేతన్నల సంక్షేమం ప్రభుత్వ ప్రాధాన్యత అని, విద్యుత్ బకాయిల అంశాన్ని లోతుగా పరిశీలించి కార్మికులకు మేలు జరిగేలా నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారు. సంక్షోభ నివారణకు అవసరమైన చర్యలు చేపడతామని తెలిపారు.

## కడియానికి నిజాయితీ లేదు: పల్లా రాజేశ్వర్ రెడ్డి

హైదరాబాద్, మార్చి 25 (ఈవార్తలు): స్టేషన్ ఘన్‌పూర్ కాంగ్రెస్ ఎమ్మెల్యే కడియం శ్రీహరిపై జనగామ బీఆర్ఎస్ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. అసెంబ్లీ లాబీల్లో మీడియాతో చిట్‌చాట్ చేసిన పల్లా.. దేవాదుల ఎత్తిపోతల పథకం సృష్టికర్తను తానేనని కడియం చెప్పుకోవడం హాస్యాస్పదమని అన్నారు. 2004 నుండి 2014 వరకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉన్న సమయంలో దేవాదుల ప్రాజెక్టు కోసం కడియం శ్రీహరి చేసింది ఏమీ లేదని పల్లా ఆరోపించారు. అప్పట్లో ఎలాంటి పాత్ర పోషించని వ్యక్తి, ఇప్పుడు తానే సృష్టికర్తనని చెప్పుకోవడం సిగ్గుచేటని మండిపడ్డారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కడియం శ్రీహరికి ఎన్నో అద్భుతమైన అవకాశాలు ఇచ్చారని పల్లా గుర్తు చేశారు. డిప్యూటీ సీఎం, ఎంపీ, ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే వంటి కీలక పదవులతో పాటు ఆయన కుటుంబ సభ్యులకు కూడా రాజకీయంగా ప్రాధాన్యత కల్పించిన విషయాన్ని విస్మరించకూడదన్నారు.

# మన చేతిలో 'డిజిటల్' అలవాట్లు!

**ప్రతి ఒక్కరు సైబర్ హైజీన్ పాటించాలి**

**తెలంగాణ వర్సిటీ ప్రొఫెసర్ యాదగిరి**

**పీఐబీ హైదరాబాద్ ఆధ్వర్యంలో వర్క్ షాప్**



డిచ్‌పల్లి, మార్చి 25 (పీఐబీ): కంప్యూటర్లు, మొబైల్ ఫోన్లు, నెట్‌వర్క్‌లను బాధ్యతాయుతంగా, క్రమశిక్షణతో ఉపయోగించాలని తెలంగాణ యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ యాదగిరి పిలుపునిచ్చారు. సైబర్ నేరాల పెరుగుదలను ఎదుర్కొనడంలో యువత, విద్యార్థులతో పాటు విద్యాసంస్థల పాత్ర కీలకమని అన్నారు. విద్యార్థుల్లో డిజిటల్ వినియోగం పెరుగుతున్న నేపథ్యంలో విశ్వవిద్యాలయాలు సైబర్ నేరాల నివారణలో ప్రధాన కేంద్రాలుగా మారుతున్నాయని చెప్పారు. పత్రికా సమాచార కార్యాలయం (పీఐబీ)–హైదరాబాద్ ఆధ్వర్యంలో తెలంగాణ యూనివర్సిటీ, నిజామాబాద్‌లో సైబర్ హైజీన్ ప్రాక్టీసెస్ పై వర్క్‌షాప్ నిర్వహించారు. విద్యార్థులు, మీడియా ప్రతినిధుల్లో సురక్షిత డిజిటల్ వినియోగంపై అవగాహన పెంపొందించడం లక్ష్యంగా ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన.. ప్రతి ఒక్కరు సైబర్ హైజీన్ పాటించాలని సూచించారు. సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధికి తోడ్పడుతున్నప్పటికీ, సరైన జాగ్రత్తలు తీసుకోకపోతే ప్రమాదాలు ఏర్పడే అవకాశం ఉందని హెచ్చరించారు. ప్రజలు అప్రమత్తంగా ఉండి సురక్షిత డిజిటల్ అలవాట్లు అవలంబించాలని అన్నారు. పీఐబీ హైదరాబాద్ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ మానస్ కృష్ణకాంత్ మాట్లాడుతూ, ఈ వర్క్‌షాప్ విద్యార్థులు, మీడియాను ఒకే వేదికపైకి తీసుకువచ్చిన తొలి హైబ్రిడ్ కార్యక్రమమని తెలిపారు. ఈ విధానం ద్వారా సైబర్ అవగాహన విస్తృత స్థాయిలో ప్రజలకు చేరుతుందని చెప్పారు. విద్యార్థులను సైబర్ అవేర్ అంబాసిడర్లుగా తీర్చిదిద్దడం ఈ కార్యక్రమ లక్ష్యమని వివరించారు. నిజామాబాద్ సైబర్ క్రైమ్ డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ వై వెంకటేశ్వరరావు మాట్లాడుతూ, పెరుగుతున్న సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. దేశవ్యాప్తంగా సైబర్ మోసాల ద్వారా సంవత్సరానికి సుమారు రూ.60,000 కోట్లకు పైగా మోసాలు నమోదవుతున్నాయని, తెలంగాణలో గత సంవత్సరం సుమారు రూ.1,600 కోట్లు, నిజామాబాద్ జిల్లాలో 2024లో రూ.16 లక్షలు, 2025లో రూ.19 లక్షలు మోసం జరిగిందని వివరించారు. బాగా చదువుకున్న వారు కూడా సైబర్ మోసాలకు గురవుతున్నారని అన్నారు. బ్యాంకు ఖాతాలను ఇతరులకు ఇవ్వకూడదని, అనుమానాస్పద లావాదేవీలకు దూరంగా ఉండాలని సూచించారు. విదేశీ ఉద్యోగాల పేరుతో మోసపోయే సైబర్ స్లేవరీ ఘటనలపైనా హెచ్చరించారు. సమాజంలో ప్రతి ఒక్కరూ అవగాహన పెంచేందుకు ముందుకు రావాలని, సమష్టి అప్రమత్తతతోనే సైబర్ నేరాలను అరికట్టవచ్చని తెలిపారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ రాంబాబు, డైరెక్టర్ అండ్ ప్రిన్సిపాల్, యూసీఏఎస్ డాక్టర్ ఎన్ స్వామి, జీ కోటేశ్వరరావు, పీఐబీ ఫీల్డ్ పబ్లిసిటీ ఆఫీసర్ శివచరణ్ రెడ్డి, పీఐబీ హైదరాబాద్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.


# హెచ్ఐవీ నివారణే లక్ష్యం

**19 జిల్లాలపై నజర్: న్యాకో**

**రాష్ట్రంలో 'మిషన్ ఎయిడ్స్ సురక్ష'**

**జిల్లాల్లో నివారణ చర్యలు బలోపేతం**

**వర్క్‌షాప్‌కు జిల్లా అధికారులు హాజరు**




హైదరాబాద్, మార్చి 25 (ఈవార్తలు): తెలంగాణలోని 19 జిల్లాల్లో హెచ్ఐవీ నివారణే లక్ష్యంగా కేంద్రం లక్షిత కార్యక్రమాలను వేగవంతం చేస్తోంది. ఇందులో భాగంగా.. 'మిషన్ ఎయిడ్స్ సురక్ష' కింద జాతీయ ఎయిడ్స్ నియంత్రణ సంస్థ (న్యాకో) బుధవారం హైదరాబాద్‌లో సురక్ష సంకల్ప్ కార్యశాలను నిర్వహించింది. ఈ వర్క్‌షాప్‌లో మిషన్ ఎయిడ్స్ సురక్ష కార్యక్రమం అమలు, ప్రణాళిక, పర్యవేక్షణపై చర్చించారు. ఈ సందర్భంగా న్యాకో డైరెక్టర్ జనరల్, కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ అదనపు కార్యదర్శి డాక్టర్ రాకేశ్ గుప్తా మాట్లాడుతూ.. 'భారతదేశ హెచ్ఐవీ నివారణ చర్యలకు ప్రాధాన్య జిల్లాలు కేంద్రబిందువుగా ఉన్నాయి. హెచ్ఐవీ నివారణ దిశగా ఫలితాలను మెరుగుపరచడానికి, జాతీయ లక్ష్యాల దిశగా పురోగతిని వేగవంతం చేయడానికి క్షేత్రస్థాయిలో కేంద్రీకృత, డేటా–ఆధారిత కార్యక్రమాలు కీలకం' అని తెలిపారు. మిషన్ ఎయిడ్స్ సురక్ష కార్యక్రమాన్ని సమర్థంగా అమలు చేయడానికి జిల్లా స్థాయిలో ప్రణాళిక, పర్యవేక్షణ, జవాబుదారీతనాన్ని బలోపేతం చేయాల్సిన అవసరముందని అన్నారు. రాష్ట్రంలోని వయోజనుల్లో హెచ్ఐవీ ప్రాబల్యం 0.41% ఉండటం, సుమారు 1,56,961 మంది హెచ్ఐవీతో జీవిస్తున్న నేపథ్యంలో ఆ మహమ్మారి నుంచి ప్రజలను రక్షించేందుకు విస్తృత కార్యక్రమాలు చేపట్టాలన్నారు. రాష్ట్రంలో 19 జిల్లాలను ప్రాధాన్య జిల్లాలుగా గుర్తించిన నేపథ్యంలో ఆయా జిల్లాల ఉన్నతాధికారులు వర్క్‌షాప్‌లో మిషన్ ఎయిడ్స్ సురక్ష పురోగతిపై నివేదికను సమర్పించారు. కార్యాచరణ, క్షేత్రస్థాయి సవాళ్లను చర్చించారు. జిల్లాల వారీగా డేటా–ఆధారిత కార్యాచరణ ప్రణాళికలను రూపొందించడానికి నిర్మాణాత్మక చర్చలు జరిపారు. హెచ్ఐవీ నివారణ వ్యూహాలను బలోపేతం చేయడం, నిర్ధారణ పరీక్ష సేవలను విస్తరించడం, యాంటీరెట్రోవైరల్ థెరపీ(ఏఆర్‌టీ) అనుసంధానం, చికిత్స కొనసాగింపును మెరుగుపరచడం, వైరల్ లోడ్ అణచివేతను పెంచడం, ముప్పు అధికంగా ఉన్న జనాభాలో లక్షిత కార్యక్రమాలను పెంచడంపై చర్చలు జరిగాయి. కార్యక్రమంలో తెలంగాణ నేషనల్ హెల్త్ మిషన్ డైరెక్టర్, తెలంగాణ రాష్ట్ర ఎయిడ్స్ నివారణ సంస్థ(టీఎస్ఏసీఎస్) ప్రాజెక్ట్ డైరెక్టర్ డాక్టర్ ఎస్ సంగీత సత్యనారాయణ, రాష్ట్ర ఉన్నతాధికారులు, అదనపు జిల్లా కలెక్టర్లు, జిల్లా వైద్యాధికారులు, జిల్లా ఎయిడ్స్ నియంత్రణాధికారులు, హైదరాబాద్, రంగారెడ్డి, ఖమ్మం, కరీంనగర్, నల్లగొండ, సిద్దిపేట, మెదక్, వరంగల్, నిజామాబాద్, ఆదిలాబాద్, సూర్యాపేట, పెద్దపల్లి, జనగామ, వికారాబాద్, కామారెడ్డి, హన్మకొండ, సంగారెడ్డి, మహబూబాబాద్, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల ప్రతినిధులు పాల్గొన్నారు.



## ఖోఖోలో కాంస్యం

**రిజర్వ్ ఎస్సైకి జగిత్యాల ఎస్పీ అభినందన**

జగిత్యాల, మార్చి 25 (ఈవార్తలు): జమ్మూ కాశ్మీర్ పోలీస్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆల్ ఇండియా పోలీస్ స్పోర్ట్స్ (ఖో ఖో) పోటీలలో తెలంగాణ రాష్ట్ర పోలీస్ తరఫున జగిత్యాల జిల్లా నుంచి పాల్గొన్న రిజర్వ్ సబ్ ఇన్స్పెక్టర్ రమేశ్ విశేష ప్రతిభ కనబరిచి కాంస్య పతకం సాధించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ అశోక్ కుమార్.. రమేశ్‌ను అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. దేశవ్యాప్తంగా నిర్వహించిన ఈ ప్రతిష్టాత్మక క్రీడా పోటీలలో తెలంగాణ పోలీస్ తరఫున పాల్గొని విజయాన్ని సాధించడం గర్వకారణమని పేర్కొన్నారు. భవిష్యత్తులో జాతీయ స్థాయిలో జరిగే క్రీడాపోటీలలో పాల్గొని మరిన్ని విజయాలు సాధించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ కిరణ్ కుమార్ పాల్గొన్నారు.

## మల్యాల వశిష్ట విద్యార్థులకు గురుకుల సీట్లు

మల్యాల, మార్చి 25 (ఈవార్తలు): జగిత్యాల జిల్లా మల్యాల మండలానికి చెందిన వశిష్ట స్కూల్ విద్యార్థులకు గురుకుల పాఠశాలల్లో సీట్లు సాధించారు. ఇటీవల నిర్వహించిన ప్రవేశ పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చి గురుకుల పాఠశాల్లో అడ్మిషన్ పొందారు. వారిలో జీ శ్రీహర్షిని (తాటిపల్లి బాలికల గురుకులం), ఏ నవనీతశ్రీ (తాటిపల్లి బాలికల గురుకులం), జీ హారిక (తాటిపల్లి బాలికల గురుకులం), సీహెచ్ ప్రణవి (తాటిపల్లి బాలికల గురుకులం), పీ హారిక (తాటిపల్లి బాలికల గురుకులం), కే లివియా (తాటిపల్లి బాలికల గురుకులం), ఆర్ శన్విక (తాటిపల్లి బాలికల గురుకులం), పీ హర్షిని (గంగాధర బాలికల గురుకులం), వై వినుష్ణ (గంగాధర బాలికల గురుకులం), టీ మణి తేజ (బూరుగుపల్లి బాలుర గురుకులం), ఎం అశ్వంత్ (బూరుగుపల్లి బాలుర గురుకులం), డీ నవతేజ్ (సింగారావుపేట్ బాలుర గురుకులం) ఉన్నారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ మూదం తిరుపతి విద్యార్థులను అభినందించారు.

## సీఎం అబద్ధాలు చెప్పొద్దు

**మధు పార్క్ రిడ్జ్ నివాసితులు**

హైదరాబాద్, మార్చి 25 (ఈవార్తలు): మధు పార్క్ రిడ్జ్ విషయంలో సీఎం రేవంత్ రెడ్డి సందర్భానుసారం విరుద్ధ ప్రకటనలు చేస్తున్నారని నివాసితులు మండిపడ్డారు. 'మా అపార్ట్మెంట్ విషయమై సీఎం రేవంత్ రెడ్డి చేసిన ప్రకటనపై మధు పార్క్ రిడ్జ్ నివాసితుల సంఘంగా మేం స్పష్టత ఇస్తున్నాం. సీఎం పరస్పర విరుద్ధమైన ప్రకటనలు చేస్తున్నారు. ఒక సందర్భంలో మధు పార్క్ రిడ్జ్‌ను ప్రభుత్వం ఎప్పుడూ స్వాధీనం చేసుకోవాలనుకోలేదని చెప్పారు. మరో ప్రకటనలో నివాసితులు ప్రభుత్వ ప్రతిపాదనను తిరస్కరించారని అన్నారు. మా వైఖరి స్పష్టం, మేం ప్రభుత్వం నుంచి వచ్చిన ఏ ప్రతిపాదననూ తిరస్కరించలేదు. అంగీకరించనూ లేదు. ప్రభుత్వం నుండి వచ్చే ఏ ప్రతిపాదన అయినా నిర్దిష్ట వివరాలతో లిఖితపూర్వకంగా ఉండాలని కచ్చితంగా చెప్తున్నాం. మేం వాటిని చర్చ కోసం మా జనరల్ బాడీ సమావేశంలో ఉంచి, అనుగుణంగా చర్యలు తీసుకుంటాం' అని అసోసియేషన్ స్పష్టం చేసింది.



## హోంగార్డుకు రూ. 20వేల వితరణ

మానకొండూరు, మార్చి 25 (ఈవార్తలు): కరీంనగర్ జిల్లా మానకొండూరు గ్రామానికి చెందిన కొండ్ర అనిల్ కుమార్ జగిత్యాల జిల్లాలో హోంగార్డుగా చాలీచాలని జీతంతో జీవితాన్ని నెట్టుకొస్తున్న తరుణంలో ఆయన భార్యకు కడుపులో కణతులు ఏర్పడి హైదరాబాద్‌లో ఆపరేషన్ నిర్వహించారు. అనిల్ ఆపదలో ఉన్న విషయాన్ని తోటి స్నేహితులు (2001 బ్యాచ్‌కు చెందిన పదవ తరగతి విద్యార్థులు) సంఘటితమై రూ.20 వేలు జమ చేసి, ఆయనకు అందించారు. తనను ఆర్థికంగా ఆదుకున్న తన స్నేహితులకు అనిల్ కృతజ్ఞతలు తెలిపారు.

# రాష్ట్రాల్లో 'బయో' ప్రాజెక్టులు

**ప్రత్యామ్నాయ విద్యుత్తు వనరులకు ప్రాధాన్యం.. ఎంపీ ఉదయ్ శ్రీనివాస్ ప్రశ్నకు కేంద్ర మంత్రి జవాబు**



కాకినాడ, మార్చి 25 (ఈవార్తలు): సంప్రదాయ విద్యుత్తు వినియోగానికి ప్రత్యామ్నాయంగా కేంద్ర ప్రభుత్వం 'నేషనల్ బయో ఎనర్జీ' ప్రోగ్రాం ద్వారా రాష్ట్రాల్లో బయోమాస్, బయోగ్యాస్ తో పాటు వ్యర్థాల నుంచి విద్యుత్ ఉత్పత్తి ప్రాజెక్టుల ఏర్పాటుకు ప్రాధాన్యం ఇస్తున్నట్లు కేంద్ర విద్యుత్ శాఖ సహాయ మంత్రి శ్రీపాద్ ఎస్సో నాయక్ తెలిపారు. కేంద్రం ఆంధ్రప్రదేశ్ కు కేటాయించిన బయోమాస్, బయోగ్యాస్ ప్రాజెక్టులు వివరాలు, కేటాయించిన నిధుల వివరాలపై బుధవారం కాకినాడ పార్లమెంట్ సభ్యులు తంగెళ్ళ ఉదయ్ శ్రీనివాస్ అడిగిన ప్రశ్నకు కేంద్రమంత్రి బదులిచ్చారు. కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా పలు రాష్ట్రాల్లో 111 బయోమాస్ ప్రాజెక్టులు, 79 వ్యర్థాలనుండి విద్యుత్ ఉత్పత్తి ప్రాజెక్టులు మంజూరు చేయగా, ఇందులో ఆంధ్రప్రదేశ్ కు ఒక బయోమాస్ ప్రాజెక్ట్, 4 వ్యర్థాలను విద్యుత్ ఉత్పత్తి ప్రాజెక్టులు, 88 చిన్న తరహా బయోగ్యాస్ ప్లాంట్లు మంజూరు చేయగా, అన్ని ప్రాజెక్టులు పూర్తయ్యి అమల్లోకి వచ్చాయని తెలిపారు. అలాగే ఆంధ్రప్రదేశ్ కు కు కేంద్ర ప్రభుత్వం బయోమాస్, వ్యర్థాల నుండి విద్యుత్ ఉత్పత్తి ప్రాజెక్టుల ఏర్పాటుకు నిధులు విడుదల చేసినట్లు కేంద్ర మంత్రి బదులిచ్చారని ఎంపీ ఉదయ్ శ్రీనివాస్ తెలిపారు.

# జగన్ జీవితం జంగిల్ బుక్

**ఏపీ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి**



అమరావతి, మార్చి 25 (ఈవార్తలు): వైసీపీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డి జీవితం 'జంగిల్ బుక్'లా మారిందని ఆంధ్రప్రదేశ్ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి విమర్శించారు. అరాచకం, అబద్ధాలు తప్పించి వాస్తవాలను ఏనాడూ మాట్లాడని నాయకత్వం ఆయనదేనని ఎద్దేవా చేశారు. ఐదేళ్ల పాలనలో అవినీతి, అక్రమాలు, ప్రజా ధనం దోపిడీ చేసి రాష్ట్రాన్ని దెబ్బతీశాడని ఆరోపించారు. అందుకే ప్రజలు ఆయనకు గట్టి బుద్ధి చెప్పి కేవలం 11 అసెంబ్లీ సీట్లకే పరిమితం చేశారని అన్నారు. ప్రజా తీర్పును గౌరవించకుండా, అసెంబ్లీకి రాకుండా బయట విమర్శలు చేయడం ఆయన బలహీనతకు నిదర్శనమని అన్నారు. గతంలో ఫ్రాంక్లిన్ టెంపుల్‌టన్, హెచ్ఎస్‌బీసీ, ఐబీఎం వంటి ప్రముఖ కంపెనీలను రాష్ట్రం నుంచి తరిమేసింది నాటి జగన్ ప్రభుత్వమేనని అన్నారు. నేడు కూటమి ప్రభుత్వం ఆ పరిస్థితులను మార్చి గూగుల్, టీసీఎస్, అర్సెలార్ మిట్టల్, కాగ్నిజెంట్, ఐబీఎం వంటి ప్రతిష్టాత్మక సంస్థలను రాష్ట్రానికి తీసుకువస్తోందని పేర్కొన్నారు. ఇది తమ ప్రభుత్వంపై పెట్టుబడిదారుల్లో ఉన్న నమ్మకానికి నిదర్శనమని మంత్రి అన్నారు. జగన్ పాలనలో చేసిన ఆర్థిక విధ్వంసం నుంచి రాష్ట్రాన్ని బయటకు తీసుకురావడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పని చేస్తూ పెట్టుబడులకు స్వర్గధామిగా ఆంధ్రప్రదేశ్‌ను నిలుపుతోందని అన్నారు. రాష్ట్రానికి వస్తున్న పెట్టుబడులు, యువతకు లభిస్తున్న ఉపాధి అవకాశాలు, వేగంగా జరుగుతున్న అభివృద్ధి, ప్రజలకు అందుతున్న సంక్షేమాన్ని చూసి జగన్ ఓర్వలేకపోతున్నారని విమర్శించారు. అందుకే ప్రతిసారి గుమ్మం కూడా దాటకుండా ఇంట్లో ప్రెస్ మీట్ ద్వారా లేదా తన పార్టీ నేతలతో సమావేశమై కూటమి ప్రభుత్వంపై బురద జల్లడమే పనిగా పెట్టుకొని పని చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. జగన్ రెడ్డి ఎన్ని కుట్రలు, కుతంత్రాలు, దుష్ప్రచారాలు చేసినా ప్రజలు తమ ప్రభుత్వంపై ఉంచిన విశ్వాసాన్ని ఏమాత్రం దెబ్బతీయలేరని అన్నారు. రాష్ట్ర అభివృద్ధి, ప్రజల సంక్షేమం కోసం కూటమి ప్రభుత్వం దృఢంగా ముందుకు సాగుతుందని జనార్ధన్ రెడ్డి అన్నారు.

## ఒకే చోట రెండు రోడ్డు ప్రమాదాలు

**కర్నూలు జిల్లాలో ముగ్గురి మృతి**

కర్నూలు, మార్చి 25 (ఈవార్తలు): ఏపీలోని కర్నూలులో బుధవారం తీవ్ర విషాదం చోటుచేసుకుంది. చెన్నమ్మ సర్కిల్ వద్ద ఒకేచోట స్వల్ప వ్యవధిలో జరిగిన రెండు వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు ప్రాణాలు కోల్పోయారు. సహాయం చేయబోయిన వారు కూడా మృత్యువాత పడటంతో స్థానికంగా విషాద ఛాయలు అలముకున్నాయి. వివరాల్లోకి వెళ్తే.. చెన్నమ్మ సర్కిల్ వద్ద వేగంగా వచ్చిన ఓ లారీ మొదట ఓ పాదచారిని ఢీకొట్టింది. ఈ ఘటనలో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ప్రమాదాన్ని చూసిన స్థానికులు వెంటనే సహాయం చేయడానికి అక్కడికి చేరుకున్నారు. పోలీసులకు, అంబులెన్స్‌కు సమాచారం ఇస్తున్న సమయంలోనే, మరో లారీ వేగంగా వారిపైకి దూసుకొచ్చింది. ఈ దుర్ఘటనలో సహాయం చేయబోయిన ఇద్దరు వ్యక్తులు కూడా అక్కడికక్కడే మరణించారు. సమాచారం అందుకున్న పోలీసులు హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. మంచి చేయాలనే ఉద్దేశంతో వెళ్లిన వారు కూడా మృత్యువాత పడటం పలువురిని కలచివేసింది. మృతుల కుటుంబాలకు సమాచారం అందించగా, వారి రోదనలు మిన్నంటాయి. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు.

## నంద్యాల వద్ద ప్రైవేట్ బస్సుకు ప్రమాదం

**10 మందికి గాయాలు, తప్పిన పెనుముప్పు**

నంద్యాల, మార్చి 25 (ఈవార్తలు): వేగంగా వెళ్తున్న ఓ ప్రైవేట్ బస్సు టైరు పేలిపోవడంతో అదుపుతప్పి పక్కనే ఉన్న పొలాల్లోకి దూసుకువెళ్లిన ఘటన ఏపీలోని నంద్యాల జిల్లా కేంద్రం సమీపంలో బుధవారం వేకువజామున జరిగింది. ఈ ఘటనలో పది మంది ప్రయాణికులకు గాయాలయ్యాయి. గాఢ నిద్రలో ఉన్న ప్రయాణికులు ఒక్కసారిగా ఉలిక్కిపడి భయంతో వణికిపోయారు. ప్రయాణికులు గాయాలతో బయటపడటంతో పెనుప్రమాదం తప్పినట్లైంది. వివరాల్లోకి వెళ్తే.. మార్నింగ్ స్టార్ ట్రావెల్స్‌కు చెందిన బస్సు 35 మంది ప్రయాణికులతో వెళ్తోంది. నంద్యాల సమీపంలోని జాతీయ రహదారిపైకి రాగానే తెల్లవారుజామున బస్సు టైరు పెద్ద శబ్దంతో పేలిపోయింది. ఆ సమయంలో బస్సు అధిక వేగంతో ఉండటంతో డ్రైవర్ ఎంత ప్రయత్నించినా అదుపులోకి రాలేదు. దీంతో రోడ్డు పక్కన ఉన్న పొలాల్లోకి వేగంగా దూసుకెళ్లింది. బస్సు అకస్మాత్తుగా కుదుపులకు లోనవడంతో లోపల ఉన్న ప్రయాణికులు భయంతో హాహాకారాలు చేశారు. అదృష్టవశాత్తు బస్సు బోల్తా పడకుండా పొలాల్లో నిలిచిపోవడంతో పెను ప్రమాదం తప్పింది. సమాచారం అందుకున్న పోలీసులు, స్థానికులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు.



## పెట్రోల్‌కు ఇబ్బందేం లేదు

**తెలంగాణ పెట్రోలియం డీలర్స్ ప్రకటన**

హైదరాబాద్, మార్చి 25 (ఈవార్తలు): తెలంగాణలో పెట్రోల్, డీజిల్ కొరత ఉందంటూ వస్తున్న వార్తల్లో ఏమాత్రం నిజం లేదని తెలంగాణ పెట్రోలియం డీలర్స్ అసోసియేషన్ స్పష్టం చేసింది. రాష్ట్రవ్యాప్తంగా ఇంధన నిల్వలు నిండుకున్నాయనే ప్రచారం పూర్తిగా అవాస్తవమని, వినియోగదారులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఒక ప్రకటనలో తెలిపింది. ఈ మేరకు కొన్ని చోట్ల బోర్డులు ఏర్పాటు చేశారు.

**అసోసియేషన్ వెల్లడించిన వాస్తవాలు:**

**సరిపడా నిల్వలు:** ప్రభుత్వ రంగ సంస్థలైన హెచ్‌పీసీఎల్, ఐఓసీఎల్, బీపీసీఎల్ వద్ద రాష్ట్ర అవసరాలకు మించి ఇంధన నిల్వలు అందుబాటులో ఉన్నాయి.

**రద్దీ వల్లే సమస్య:** ఇంధనం దొరకదనే భయంతో వాహనదారులు ఒక్కసారిగా బంకుల వద్దకు చేరుకోవడం, అందరూ 'ఫుల్ ట్యాంక్' చేయించుకోవడానికి మొగ్గు చూపడం వల్లే బంకుల్లో ఉన్న నిల్వలు త్వరగా ఖాళీ అవుతున్నాయి.

**తాత్కాలిక అంతరాయం:** బంకుల్లో స్టాక్ అయిపోయిన తర్వాత, డిపోల నుంచి మళ్ళీ ట్యాంకర్లు వచ్చి నింపడానికి కొంత సమయం పడుతుంది. ఈ గ్యాప్‌లో 'నో స్టాక్' బోర్డులు కనిపిస్తుండటంతో ప్రజలు దానిని శాశ్వత కొరతగా భావిస్తున్నారు.

## ఇండియన్ కలినరీ ఇనిస్టిట్యూట్‌తో ఏపీ ఎంఓయూ

తిరుపతి, మార్చి 25 (ఈవార్తలు): ఆంధ్రప్రదేశ్‌ను కలినరీ టూరిజం హబ్ గా తీర్చిదిద్దే లక్ష్యంతో ఆంధ్రప్రదేశ్ పర్యాటక శాఖ తిరుపతిలోని ఇండియన్ కలినరీ ఇనిస్టిట్యూట్ తో అవగాహనా ఒప్పందం చేసుకుంది. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సమక్షంలో ఈ కీలకమైన ఎంఓయూ కుదిరింది. ఇండియన్ కలినరీ ఇనిస్టిట్యూట్ ప్రతినిధులు–ఏపీ పర్యాటక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్ జైన్‌లు ముఖ్యమంత్రి సమక్షంలో ఒప్పంద పత్రాలను మార్చుకున్నారు. తెలుగు రుచులను, వంటకాలను ప్రపంచానికి పరిచయం చేయటంతో పాటు ప్రాంతీయ ఆహార సంస్కృతిని చాటి చెప్పేలా ఇండియన్ కలినరీ ఇనిస్టిట్యూట్ సహకారం అందించనుంది. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఆంధ్రప్రదేశ్‌ను కలినరీ టూరిజానికి ఓ కీలకమైన ప్రాంతంగా తీర్చిదిద్దేందుకు వీలుగా ఈ ఎంఓయూ తోడ్పడనుంది. ప్రత్యేకించి కలినరీ విభాగంలో నైపుణ్యాభివృద్ధి కల్పన, ఉపాధి, ఉద్యోగ అవకాశాలు, ఆంధ్రప్రదేశ్ టూరిజం అథారిటీ నిర్వహించే ఫుడ్ ఫెస్టివల్స్, టూరిజం ఈవెంట్లను నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా తెలుగు వంటకాల రుచులను జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో తెలియచేసేలా కార్యాచరణ చేపట్టనున్నారు. ఈ అవగాహనా ఒప్పందం కార్యక్రమంలో పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్, టూరిజం కార్పొరేషన్ చైర్మన్ నూకసాని బాలాజీ, ఏపీ హోటల్ అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

## చంద్రబాబుకు భయపడొద్దు

**ఆ రోజులు పోయాయి: జగన్**

తాడేపల్లి, మార్చి 25 (ఈవార్తలు): వైసీపీ అధినేత జగన్ ప్రకాశం జిల్లా అద్దంకి నియోజకవర్గ పార్టీ నేతలతో కీలక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కూటమి ప్రభుత్వంపై, ముఖ్యంగా సీఎం చంద్రబాబుపై ఆయన నిప్పులు చెరిగారు. పాలనలో అంతా తనదే అన్నట్టుగా చంద్రబాబు వ్యవహరిస్తున్నారని, ప్రతి చిన్న విషయంలో 'క్రెడిట్ చోరీ' చేస్తున్నారని మండిపడ్డారు. ఆర్సెలార్ మిట్టల్ స్టీల్ ప్లాంట్ మన హయాంలోనే రాష్ట్రానికి వచ్చిందని, కానీ ఇప్పుడు తన వల్లే వచ్చినట్టుగా చంద్రబాబు 'బిల్డప్' ఇస్తున్నారని జగన్ ఎద్దేవా చేశారు. గూగుల్ విషయంలోనూ ఇదే జరిగిందని, మాటలు కోటలు దాటుతున్నా చేతల్లో ఏమీ లేదని విమర్శించారు. రాబోయే రోజుల్లో పార్టీని సరికొత్తగా తీర్చిదిద్దుతామని, 'జగన్ 2.0'లో కార్యకర్తలకు అత్యంత ప్రాధాన్యత ఉంటుందని హామీ ఇచ్చారు. నేతలెవరూ చంద్రబాబును చూసి భయపడాల్సిన అవసరం లేదని, ఆ రోజులు పోయాయని ధైర్యం చెప్పారు. నియోజకవర్గాల పునర్విభజన పరిణామమని జగన్ అభిప్రాయపడ్డారు. దీనివల్ల మహిళా రిజర్వేషన్లు అమల్లోకి వస్తాయని, గతంలో తాము పదవులు, కాంట్రాక్టుల్లో మహిళలకు ప్రాధాన్యత ఇచ్చామని, ఇప్పుడు చట్టసభల్లో కూడా మన మహిళలకు మరిన్ని అవకాశాలు వస్తాయని పేర్కొన్నారు.

# తినే తిండితోనూ 'యుద్ధం'

## ప్రపంచ దేశాలపై పశ్చిమాసియా ప్రభావం.. ఎరువుల రవాణాకు ఆటంకం: డబ్ల్యూటీవో

న్యూయార్క్: ఇరాన్ యుద్ధం వల్ల ప్రపంచ దేశాలు ఇప్పటికే చమురు సరఫరా సమస్యలను ఎదుర్కొంటున్నాయి. మరోవైపు హర్మూజ్‌ను మూసివేయడంతో చమురు, గ్యాస్‌తో పాటు ఎరువుల రవాణాకూ ఆటంకం ఏర్పడుతోందని ప్రపంచ వాణిజ్య సంస్థ (ఔూ) డిప్యూటీ డైరెక్టర్ జనరల్ జేన్ మేరీ పౌగమ్ పేర్కొన్నారు. యూరియా సరఫరాకు అంతరాయాలు ఏర్పడుతుండడంతో.. ఎరువుల కొరత, అధిక ధరల రూపంలో ప్రపంచ ఆహార భద్రతకు ముప్పు కలిగే అవకాశముందని హెచ్చరించారు. ఐక్యరాజ్యసమితి వాణిజ్య, అభివృద్ధి విభాగం వెల్లడించిన వివరాల ప్రకారం.. ప్రపంచంలోని మూడింట ఒక వంతు ఎరువులు గల్ఫ్ దేశాల నుంచి హర్మూజ్ జలసంధి మీదుగానే రవాణా అవుతాయి. దీని మూసివేత కొనసాగితే.. యూరియా దిగుమతి చేసుకునే వ్యవసాయ ఆధారిత దేశాల్లో నిల్వలు తగ్గిపోయే ప్రమాదం ఉంది. యుద్ధం మొదలై కొన్ని వారాలు మాత్రమే అవుతున్నందున ప్రస్తుతం ఎరువుల కొరత అంతగా లేనప్పటికీ ఈ ప్రభావం వచ్చే ఏడాది పంటలపై పడనుంది. అలా అని ప్రపంచ దేశాలు ఎరువులు, ఆహార ధాన్యాల నిల్వలు పెంచుకోవడం ప్రారంభిస్తే అంతర్జాతీయ వాణిజ్యానికి అంతరాయం కలుగుతుంది. దీనివల్ల ఆహారాన్ని దిగుమతి చేసుకునే పేద దేశాలు దయనీయ పరిస్థితులను ఎదుర్కొనే ప్రమాదం ఉంది. మరోవైపు యూరియా ఉత్పత్తికి అవసరమైన ద్రవరూప సహజ వాయువు ఎల్ఎన్‌జీని భారత్ కొన్నేళ్లుగా ఖతార్ నుంచి దిగుమతి చేసుకుంటోంది. ప్రస్తుతం ఆ దేశం నుంచి ఎల్ఎన్‌జీ సరఫరా నిలిచిపోయింది. దీంతో ప్రధాన ఆహార ఎగుమతిదారులైన భారత్, థాయ్‌లాండ్, బ్రెజిల్ వంటి దేశాలలోని కొన్ని యూరియా కంపెనీలు ప్లాంట్లను మూసివేసే పరిస్థితులు నెలకొన్నాయి. యుద్ధం ప్రారంభమైనప్పటి నుంచి ప్రపంచ మార్కెట్‌లో యూరియా ధరలు సుమారు 25 శాతం పెరిగాయి. సరఫరా కొరత కారణంగా ఇతర ఎరువుల ధరలు కూడా క్రమంగా పెరుగుతున్నాయి. ఎరువులను ఎక్కువగా వినియోగించుకునే మార్కెట్లలో భారత్, బ్రెజిల్ వంటి దేశాలు ఉన్నాయి. దీంతో ఆయా దేశాలపై అధిక ప్రభావం పడే అవకాశం ఉంది. అమెరికా కూడా యూరియాకు అతిపెద్ద మార్కెట్‌గా ఉన్నప్పటికీ నత్రజనిలో సగానికి పైగా దేశీయంగానే ఉత్పత్తి చేసుకుంటుండడం వల్ల ఆ దేశంపై ఎక్కువ ప్రభావం ఉండదు. ప్రపంచ మార్కెట్లో కొరత కారణంగా ఎరువుల ధరలు పెరగడంతో రైతుల ఉత్పత్తి ఖర్చులు పెరగనున్నాయి. చమురు ధరల పెరుగుదల వల్ల రైతుల రవాణా ఖర్చులపై కూడా ప్రభావం పడుతుంది. దీంతో ప్రపంచ దేశాల్లో ఆహార ధాన్యాలు, వ్యవసాయ ఉత్పత్తుల ధరలు కూడా పెరగనున్నాయి. ఈ ఏడాది ప్రపంచవ్యాప్తంగా ఆహార ధరలు సుమారు 2శాతం పెరిగే అవకాశం ఉంది.




## లింకన్ నౌకపై దాడి చేశాం: ఇరాన్

టెహ్రాన్: ఇరాన్‌పై దాడులను ఐదు రోజుల పాటు నిలిపివేస్తున్నట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ప్రకటించిన రెండు రోజుల అనంతరం, అనూహ్య పరిణామం చోటుచేసుకుంది. అగ్రరాజ్యం అమెరికాకు చెందిన విమాన వాహక నౌక యూఎస్ఎస్ అబ్రహం లింకన్ లక్ష్యంగా ఇరాన్ క్రూయిజ్ క్షిపణితో దాడులు చేసింది. ఈ మేరకు ఇరాన్ ప్రభుత్వం ప్రకటన చేసింది. యూఎస్ఎస్ అబ్రహం లింకన్ విమాన వాహక నౌక వైపు తాము క్రూయిజ్ క్షిపణిని ప్రయోగించామని ఇరాన్ ప్రభుత్వ టెలివిజన్ ప్రసారం చేసింది. దీనిని అమెరికా ధృవీకరించవలసి ఉంది. ఈ విమాన వాహక నౌక కదలికలను నిరంతరం పరిశీలిస్తున్నామని, దానిని లక్ష్యంగా చేసుకుంటామని ఇరాన్ హెచ్చరించింది. ఆ తర్వాత గంటలోపు క్షిపణి దాడి జరగడం గమనార్హం. ఇందుకు సంబంధించిన వీడియోను ఇరాన్ మీడియా విడుదల చేసింది. అబ్రహం లింకన్‌పై దాడి చేశామని ఇరాన్ ఇదివరకు కూడా ప్రకటించింది. తమ బాలిస్టిక్ క్షిపణులు ఈ నౌకను ఢీకొట్టాయని, దీనితో అది పని చేయడం లేదని, గల్ఫ్ జలాల నుంచి వెనక్కి తగ్గిందని ఇటీవల ఇరాన్ ప్రకటించగా, అమెరికా తోసిపుచ్చింది.



## రష్యా చమురు వచ్చేస్తోంది

**భారత్‌కు 60 మిలియన్ బ్యారెళ్ల చమురు**

**ఏప్రిల్‌లో డెలివరీ.. చమురు కొరతకు బ్రేక్**

మాస్కో: భారత చమురు సంస్థలు రష్యా నుంచి సుమారు 60 మిలియన్ బ్యారెళ్ల చమురును కొనుగోలు చేసినట్లు తెలుస్తోంది. పశ్చిమాసియాలో యుద్ధం నేపథ్యంలో మన దేశంలో ఇంధన సరఫరాకు ఇబ్బందులు తలెత్తకుండా కేంద్ర ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోంది. ఇందులో భాగంగా రష్యా నుంచి చమరును కొనుగోలు చేస్తోంది. ఇది వచ్చే నెలలో డెలివరీ కానున్నట్లు బ్లూమ్‌బర్గ్‌లో కథనం వచ్చింది. బ్రెంట్ క్రూడ్ ధర కంటే బ్యారెల్‌కు 5 నుంచి 15 డాలర్లు అధికంగా చెల్లించి భారత రిఫైనరీలు ఈ చమురును బుక్ చేసినట్లు ఈ కథనం పేర్కొంది. ఈ మొత్తం ఫిబ్రవరిలో చేసిన చమురు కొనుగోళ్ల కంటే రెట్టింపు అని వెల్లడించింది. రష్యా చమురుపై ఉన్న ఆంక్షలను ఇటీవల అమెరికా ఎత్తివేసింది. ఈ నేపథ్యంలో తాజా కొనుగోళ్లు జరిగాయి. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు కొనసాగుతున్నంత కాలం రష్యా చమురుపై ఆంక్షల మినహాయింపును అమెరికా పొడిగించే అవకాశాలు ఉన్నాయని చెబుతున్నారు. రష్యా నుంచి ఈ చమురు కొనుగోలుకు సంబంధించి అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. ఇరాన్ చమురుపై ఉన్న ఆంక్షలను కూడా అమెరికా ఎత్తివేయడంతో, ఆ దేశ చమురును కూడా భారత రిఫైనరీలు కొనుగోలు చేసినట్లు తెలుస్తోంది.

## మీ ఓటమిని దౌత్య విజయం కానివ్వొద్దు

**అమెరికాకు ఇరాన్ హెచ్చరిక**

టెహ్రాన్: పశ్చిమాసియాలో కొనసాగుతున్న ఉద్రిక్తతల నడుమ ఇరాన్, అమెరికాకు తీవ్రస్థాయిలో హెచ్చరికలు జారీ చేసింది. ఇరాన్-ఇజ్రాయెల్ ఘర్షణలో తమ వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు అమెరికా ప్రయత్నిస్తోందని ఇరాన్ సైనిక దళాల ముఖ్య ప్రతినిధి ఆరోపించారు. ఓటమిని ఒక 'దౌత్యపరమైన ముందడుగు'గా చిత్రీకరించే ప్రయత్నాలను మానుకోవాలని ట్రంప్ కు హితవు పలికారు. ఇరాన్ ప్రయోగించిన క్షిపణులను నిలువరించడంలో అమెరికా విఫలమైందని, ఆ నిస్సహాయతను ఇప్పుడు ప్రపంచం ముందు ఒక విజయంగా ప్రచారం చేసుకోవాలని చూస్తోందని ఆయన విమర్శించారు. తమ దేశ సార్వభౌమాధికారాన్ని కాపాడుకోవడానికి ఎలాంటి కఠిన చర్యలకైనా వెనుకాడబోమని, శత్రువుల ఎత్తుగడలను తిప్పికొట్టే పూర్తి సైనిక సామర్థ్యం తమకు ఉందని ఆయన స్పష్టం చేశారు. ఈ ప్రాంతంలో ఉద్రిక్తతలు పెరగడానికి అమెరికా జోక్యమే కారణమని ఇరాన్ ఆరోపించింది. ఇజ్రాయెల్‌కు అందిస్తున్న సైనిక సహకారాన్ని తక్షణమే నిలిపివేయాలని డిమాండ్ చేసింది. ఒకవైపు శాంతి చర్చల గురించి మాట్లాడుతూ, మరోవైపు క్షేత్రస్థాయిలో ఇజ్రాయెల్‌ను ప్రోత్సహించే ద్వంద్వ వైఖరిని అమెరికా వీడాలని సూచించింది. ఈ అబద్ధపు ప్రచారాలు ఆపకపోతే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని ఇరాన్ సైనిక ప్రతినిధి హెచ్చరించారు.

## ఎల్‌పీజీ రీఫిల్ నిబంధనల్లో మార్పులు లేవు

**బుకింగ్‌పై వదంతులు నమ్మొద్దు: పెట్రోలియం శాఖ**

న్యూఢిల్లీ: ఎల్‌పీజీ గ్యాస్ సిలిండర్ రీఫిల్ బుకింగ్ గడువును మార్చారంటూ వస్తున్న వార్తలను కేంద్ర ప్రభుత్వం తీవ్రంగా ఖండించింది. ఇవి పూర్తిగా నిరాధారమైన, తప్పుదోవ పట్టించే కథనాలని స్పష్టం చేసింది. ఎల్‌పీజీ కనెక్షన్లకు సంబంధించి రీఫిల్ బుకింగ్ నిబంధనల్లో ఎలాంటి మార్పులు చేయలేదని కేంద్ర పెట్రోలియం, సహజవాయువు మంత్రిత్వ శాఖ బుధవారం ఒక ప్రకటనలో తెలిపింది. కొన్ని మీడియా సంస్థలు, సోషల్ మీడియాలో ప్రధాన్ మంత్రి ఉజ్వల యోజన లబ్ధిదారులకు 45 రోజులు, ఇతరులకు 25 నుంచి 35 రోజుల గడువు విధించినట్టు ప్రచారం జరిగింది. ఈ వార్తల్లో ఏమాత్రం నిజం లేదని ప్రభుత్వం స్పష్టం చేసింది. ప్రస్తుతం అమల్లో ఉన్న నిబంధనల ప్రకారమే రీఫిల్ బుకింగ్ ప్రక్రియ కొనసాగుతుందని వివరించింది. పట్టణ ప్రాంతాల్లో 25 రోజుల తర్వాత, గ్రామీణ ప్రాంతాల్లో 45 రోజుల తర్వాత వినియోగదారులు మరో సిలిండర్‌ను బుక్ చేసుకోవచ్చు. ఇలాంటి తప్పుడు సమాచారాన్ని నమ్మవద్దని, అనవసరంగా ఆందోళనతో సిలిండర్లను బుక్ చేసుకోవద్దని ప్రజలకు ప్రభుత్వం సూచించింది. దేశవ్యాప్తంగా సరిపడా ఎల్‌పీజీ నిల్వలు ఉన్నాయని, ఆందోళన చెందాల్సిన అవసరం లేదని భరోసా ఇచ్చింది. దేశంలోని అన్ని రిఫైనరీలు పూర్తి సామర్థ్యంతో పనిచేస్తున్నాయని, పెట్రోల్, డీజిల్ నిల్వలు కూడా పుష్కలంగా ఉన్నాయని పేర్కొంది. ఇదే సమయంలో పెట్రోల్, డీజిల్ కొరత ఉందన్న వదంతులను భారత్ పెట్రోలియం కార్పొరేషన్ కూడా ఖండించింది. ఇరాన్ యుద్ధం కారణంగా ఆర్థిక వ్యవస్థపై పడే ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు చమురు, గ్యాస్, సరఫరా వ్యవస్థలపై దృష్టి సారించేందుకు కేంద్రం ఏడు ఉన్నతస్థాయి బృందాలను ఏర్పాటు చేసినట్లు తెలిపింది.

## అమెరికా 'ఉగ్రవాద' దేశం: కిమ్

ప్యాంగ్యాంగ్: ఉత్తర కొరియా సుప్రీం లీడర్ కిమ్ జోంగ్ ఉన్ మరోసారి అమెరికాపై నిప్పులు చెరిగారు. పార్లమెంట్ సమావేశంలో ప్రసంగించిన ఆయన, అమెరికాను ఒక ఉగ్రవాద రాజ్యంగా అభివర్ణించారు. ప్రపంచవ్యాప్తంగా శాంతికి విఘాతం కలిగిస్తున్నది అమెరికా సైనిక విధానాలేనని ఆయన మండిపడ్డారు. ముఖ్యంగా ఇరాన్ అణు కేంద్రాలపై అమెరికా, ఇజ్రాయెల్ దాడుల నేపథ్యంలో కిమ్ చేసిన ఈ వ్యాఖ్యలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి. ఉత్తర కొరియా తన సార్వభౌమాధికారాన్ని కాపాడుకోవడానికి అణ్వాయుధాలను ఎప్పటికీ వదులుకోదని కిమ్ స్పష్టం చేశారు. అణు సామర్థ్యం అనేది దేశ భద్రతకు అత్యవసరమని ఆయన పేర్కొన్నారు. నేరుగా ఇరాన్ పేరు ఎత్తనప్పటికీ, పశ్చిమాసియాలో అమెరికా సాగిస్తున్న దాడులను కిమ్ తప్పుబట్టారు.



## ఒవైసీకి రెండు ముఖాలు

**పార్లమెంటులో ఒకటి, బయట మరొకటి**

**కేంద్ర మంత్రి గిరిరాజ్ సింగ్ మండిపాటు**

న్యూఢిల్లీ: ఏఐఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీకి రెండు ముఖాలు ఉన్నాయని, ఆయన పార్లమెంటులో ఒకలా, బయట మరోలా మాట్లాడుతున్నారని కేంద్ర మంత్రి గిరిరాజ్ సింగ్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఆయన ఓ వార్తా సంస్థతో మాట్లాడుతూ.. ఒవైసీ వైఖరిపై ఘాటు విమర్శలు చేశారు. 'పార్లమెంటులో రాజ్యాంగం, చట్టం గురించి మాట్లాడే ఒవైసీ, బయటకు రాగానే అక్బర్, బాబర్ వంటి వారి అజెండాను భుజానకెత్తుకుంటున్నారు. భారత్‌లో షరియా చట్టాలను ఎప్పుడు అమలు చేయాలన్నదే ఆయన లక్ష్యం' అని గిరిరాజ్ సింగ్ ఆరోపించారు. రాబోయే పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేయనున్నట్లు ఒవైసీ ఇటీవల ప్రకటించిన నేపథ్యంలో గిరిరాజ్ సింగ్ వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. తృణమూల్ కాంగ్రెస్ నుంచి బహిష్కరణకు గురై 2025 డిసెంబరులో 'ఆమ్ జనతా ఉన్నయన్ పార్టీ' (ఏజేయూపీ)ని స్థాపించిన హుమాయున్ కబీర్‌తో కలిసి ఎంఐఎం కూటమిగా బరిలోకి దిగుతోంది. ఈ పరిణామం రాష్ట్రంలోని మైనారిటీ రాజకీయ శక్తులను ఏకం చేసే కీలక ప్రయత్నంగా భావిస్తున్నారు. ఇటీవల హైదరాబాద్‌లోని దారుస్సలాంలో జరిగిన పార్టీ సమావేశంలో ఒవైసీ మాట్లాడుతూ.. పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ హయాంలో బెంగాలీ ముస్లింలకు అన్యాయం జరుగుతోందని ఆరోపించారు. ఆమె ప్రభుత్వంలో కనీసం 5 లక్షల ఓబీసీ సర్టిఫికేట్లను రద్దు చేశారని విమర్శించారు. ఇదే సమయంలో ప్రధాని నరేంద్ర మోదీపై గిరిరాజ్ సింగ్ ప్రశంసలు కురిపించారు. "ప్రపంచం ఎన్నో సవాళ్లను ఎదుర్కొంటున్న తరుణంలో భారత్ వైపు ఆశగా చూస్తోంది. ప్రపంచ దేశాల విశ్వాసం మోదీపైనే ఉంది. ఆయన దేశాన్ని, పరిస్థితులను సీరియస్‌గా తీసుకుని అంకితభావంతో పనిచేస్తున్నారు. ప్రతిపక్ష నేతలా గందరగోళం సృష్టించడం లేదు" అని అన్నారు.

# భారత్ దళారీ కాదు: జైశంకర్



న్యూఢిల్లీ: పాకిస్థాన్ మాదిరిగా భారతదేశం అమెరికా, ఇరాన్ మధ్య మధ్యవర్తిత్వం వహించదని విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ స్పష్టం చేశారు. గత కొద్దిరోజులుగా పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు కొనసాగుతున్న విషయం తెలిసిందే. ఇరాన్‌పై ఐదు రోజుల పాటు దాడులను ఆపివేస్తున్నట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. చర్చల అనంతరం తదుపరి నిర్ణయం ఉంటుందని రెండు రోజుల క్రితం వెల్లడించారు. ఈ నేపథ్యంలో ఇరుదేశాల మధ్య మధ్యవర్తిత్వం వహిస్తున్నట్లు పాకిస్థాన్ ప్రకటించింది. ఈ నేపథ్యంలో జైశంకర్ పైవ్యాఖ్యలు చేశారు. 1981 నుంచి అమెరికా పాకిస్థాన్‌ను ఉపయోగించుకుంటోందని, ఈ క్రమంలో మధ్యవర్తిత్వం అంశం కొత్తేమీ కాదని అన్నట్లు ఆ కథనంలో పేర్కొంది. పశ్చిమాసియా సంక్షోభంపై మాట్లాడేందుకు పార్లమెంట్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఈ సమావేశంలో 'మనది దలాల్ దేశం కాదు' అని వ్యాఖ్యానించారని తెలుస్తోంది. ఈ యుద్ధం ప్రపంచవ్యాప్తంగా తీవ్ర ప్రభావం చూపుతోందని, దీనికి త్వరగా ముగింపు పలకాలని తనకు ఫోన్ చేసిన ట్రంప్‌కు ప్రధాని మోదీ స్పష్టం చేశారని ఈ సమావేశంలో తెలిపారు. పశ్చిమాసియా ఉద్రిక్తతలపై ఢిల్లీ మౌనంగా ఉంటోందన్న ప్రతిపక్షాల ఆరోపణలపై కూడా ఆయన స్పందించారు. ఈ అంశంపై మనం ఎప్పటికప్పుడు స్పందిస్తున్నామని తెలియజేశారు. ఖమేనీ మృతిపై ఆలస్యంగా స్పందించారన్న వార్తలను కూడా జైశంకర్ కొట్టిపారేశారు. ఇరాన్ రాయబార కార్యాలయం తెరవగానే విదేశాంగ కార్యదర్శి పర్యటించి సంతాప సందేశం రాశారని గుర్తు చేశారు. గల్ఫ్ ప్రాంతాల్లోని భారతీయుల భద్రత, దేశీయ ఇంధన భద్రత తమ ప్రాథమిక లక్ష్యంగా పెట్టుకున్నామని ఈ అఖిల పక్ష సమావేశంలో ప్రభుత్వం స్పష్టం చేసిందని పీటీఐ కథనం పేర్కొంది. ఈ వ్యవహారంలో పాకిస్థాన్ మధ్యవర్తిత్వం పాత్ర పోషిస్తుంటే మనం మూగ ప్రేక్షకులుగా మిగిలిపోయామని కాంగ్రెస్ ఎంపీ తారిఖ్ అన్వర్ విమర్శించారు. ఈ అంశంపై రాజ్యసభలో చర్చించాలని డిమాండ్ చేశారు.



## హే! పాక్.. కమ్ బ్యాక్!

**హర్మూజ్ దాటిన పాక్ నౌక.. అనుమతి లేదని వెనక్కి రప్పించిన ఇరాన్**

టెహ్రాన్: హర్మూజ్ జలసంధి మీదుగా వెళ్లడానికి ముందస్తు అనుమతులు తీసుకోకపోవడంతో పాకిస్థాన్‌కు చెందిన కంటైనర్ నౌకను ఇరాన్ వెనక్కి రప్పించుకుంది. పశ్చిమాసియాలో యుద్ధ వాతావరణం నేపథ్యంలో ఇరాన్ సరిహద్దుల్లోని హర్మూజ్ జలసంధిలో నౌకాయానానికి సంబంధించి ఆ దేశం నిబంధనలు విధించింది. ఈ జలసంధి మీదుగా వెళ్లడానికి అనుమతులను తప్పనిసరి చేసింది. ఈ క్రమంలో హర్మూజ్ మీదుగా పాకిస్థాన్‌కు చెందిన కంటైనర్ కరాచీ వెళుతోంది. అయితే అనుమతులు లేకుండా ప్రయాణించడంతో ఆ నౌకను వెనక్కి రప్పించినట్లు ఇస్లామిక్ రిపబ్లిక్ ఆఫ్ ఇరాన్ (ఐఆర్జీసీ) వెల్లడించింది. హర్మూజ్ గుండా వెళ్లే ప్రతి నౌక ఐఆర్జీసీ సముద్ర అధికార యంత్రాంగంతో సమన్వయం చేసుకోవాలని ఇరాన్ స్పష్టం చేసింది. నిబంధనలు ఉల్లంఘిస్తే జోక్యం చేసుకుంటామని స్పష్టం చేసింది. పాకిస్థాన్‌కు చెందిన నౌకను ఇరాన్ వెనక్కి రప్పించినట్లు కాబుల్‌లోని ఇరాన్ రాయబార కార్యాలయం కూడా ధ్రువీకరించింది. యునైటెడ్ అరబిక్ ఎమిరేట్స్ (యూఏఈ)లోని షార్జా నుండి ఈ నౌక కరాచీకి వెళుతోంది. అమెరికా, ఇజ్రాయెల్ దేశాలతో యుద్ధం నేపథ్యంలో ఇరాన్ హర్మూజ్ జలసంధిని మూసివేసిన విషయం తెలిసిందే. ఈ జలసంధి గుండా తాము అనుమతించిన నౌకలు వెళ్లాలని చెబుతోంది.

## జేడీ వాన్స్‌తో చర్చలకు ఇరాన్ మొగ్గు!

టెహ్రాన్: అమెరికా, ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు తగ్గించేందుకు తెరవెనుక జరుగుతున్న చర్చల్లో ఆసక్తికర పరిణామం చోటుచేసుకుంది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ బృందం కంటే, ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్‌తో చర్చలు జరపడానికే ఇరాన్ ఎక్కువ ఆసక్తి చూపుతోంది. ట్రంప్ ప్రధాన సలహాదారులు, అల్లుడు అయిన జేర్డ్ కుష్నర్ తో పాటు స్టీవ్ విట్‌కాఫ్‌లను పక్కనపెట్టి వాన్స్‌తో సంప్రదింపులకు టెహ్రాన్ మొగ్గు చూపుతున్నట్టు తెలుస్తోంది. జేర్డ్ కుష్నర్ పట్ల ఇరాన్‌కు తీవ్ర అపనమ్మకం ఉండటమే ఇందుకు ప్రధాన కారణంగా విశ్లేషకులు చెబుతున్నారు. ఇజ్రాయెల్‌తో కుష్నర్‌కు ఉన్న సన్నిహిత సంబంధాల వల్ల, ఆయన చర్చల్లో నిష్పక్షపాతంగా వ్యవహరించరని ఇరాన్ భావిస్తోంది. గతంలో ఇజ్రాయెల్, అరబ్ దేశాల మధ్య కుదిరిన 'అబ్రహం ఒప్పందాల'లో కుష్నర్ పోషించిన కీలక పాత్రను ఇరాన్ తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. మరోవైపు, రిపబ్లికన్ సెనేటర్ అయిన జేడీ వాన్స్.. అమెరికా అనవసరమైన విదేశీ యుద్ధాల్లో జోక్యం చేసుకోకూడదనే వైఖరిని బలంగా వినిపిస్తున్నారు. ఆయనతో చర్చలు జరిపితే, మధ్యప్రాచ్యంలో శాంతికి ఎక్కువ అవకాశాలు ఉంటాయని, తమ ప్రయోజనాలను కాపాడుకోవచ్చని ఇరాన్ భావిస్తున్నట్లు సమాచారం. ట్రంప్ బృందంలోని కఠిన వైఖరి గల వారిని తప్పించి, సానుకూల దృక్పథం ఉన్న నేతలతో మాట్లాడటం ద్వారా అమెరికా-ఇజ్రాయెల్ బంధాన్ని బలహీనపరచాలనేది కూడా ఇరాన్ ఎత్తుగడ కావచ్చని అంతర్జాతీయ నిపుణులు విశ్లేషిస్తున్నారు.

## ఇరాన్‌పై 15,000 బాంబులు వేశాం

**3 వేల లక్ష్యాలపై దాడులు: ఇజ్రాయెల్**

జెరూసలేం: యుద్ధం ప్రారంభమైన ఫిబ్రవరి 28వ తేదీ నుంచి ఇరాన్‌పై 15,000 బాంబులు వేశామని ఇజ్రాయెల్ ప్రకటించింది. ఈ మేరకు మంత్రి ఇజ్రాయెల్ కాట్జ్ మాట్లాడుతూ, గత ఏడాది జూన్ నెలతో పోలిస్తే నాలుగు రెట్లు ఎక్కువ బాంబులు వేశామని తెలిపారు. ఫిబ్రవరి 28వ తేదీన ఇరాన్‌పై అమెరికాతో కలిసి ఇజ్రాయెల్ యుద్ధం ప్రారంభించిన విషయం తెలిసిందే. యుద్ధం ప్రారంభమైనప్పటి నుంచి తమ సైన్యం 15 వేల బాంబులను ఇరాన్‌పై ప్రయోగించిందని కాట్జ్ వెల్లడించారు. గత ఏడాది జూన్‌లో 12 రోజుల పాటు జరిగిన సంఘర్షణ సమయంలో కంటే నాలుగురెట్లు బాంబులు ఉపయోగించినట్లు తెలిపారు. ఇరాన్‌లోని 3,000 లక్ష్యాలపై దాడులు చేసినట్లు తెలిపారు. అయితే ఇరాన్‌పై దాడిని ఐదు రోజుల పాటు నిలిపివేస్తున్నట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ రెండు రోజుల క్రితం సంచలన ప్రకటన చేశారు.

# 'వందేమాతరం' తప్పనిసరి కాదు

**సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు**

న్యూఢిల్లీ: ప్రభుత్వ, అధికారిక కార్యక్రమాల్లో జాతీయ గేయం 'వందేమాతరం' పాడాలంటూ కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన సర్క్యులర్‌ను సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్‌ను విచారించేందుకు సుప్రీంకోర్టు నిరాకరించింది. ఆ సర్క్యులర్ కేవలం సలహా పూర్వకమైనదే తప్ప, తప్పనిసరి కాదని స్పష్టం చేసింది. అందులో ఎలాంటి శిక్షార్హమైన చర్యలు పేర్కొననందున, ఈ పిటిషన్‌పై విచారణ తొందరపాటు అవుతుందని అభిప్రాయపడింది. భారత ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్, జస్టిస్ జాయ్‌మాల్యా బాగ్చి, జస్టిస్ విపుల్ ఎం. పంచోలిలతో కూడిన ధర్మాసనం ఈ పిటిషన్‌పై విచారణ జరిపింది. ఈ ఏడాది జనవరి 28న కేంద్రం జారీ చేసిన నోటిఫికేషన్ కేవలం సలహా మాత్రమేనని, దాన్ని పాటించకపోతే శిక్షలు ఉంటాయని ఎక్కడా చెప్పలేదని ధర్మాసనం పేర్కొంది. "ఒకవేళ శిక్షార్హమైన చర్యలు తీసుకుంటే లేదా దీన్ని తప్పనిసరి చేస్తే అప్పుడు విచారిస్తాం. ప్రస్తుతానికి ఇందులో అలాంటివేమీ లేవు" అని కోర్టు వ్యాఖ్యానించింది. పిటిషనర్ తరఫున వాదనలు వినిపించిన సీనియర్ న్యాయవాది సంజయ్ హెగ్డే, సర్క్యులర్‌లో శిక్షలు లేకపోయినా ఇది పరోక్ష ఒత్తిడికి దారితీస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. వందేమాతరం పాడటానికి లేదా గౌరవ సూచకంగా నిలబడటానికి నిరాకరించే వారు సామాజిక వివక్షను ఎదుర్కొనే ప్రమాదం ఉందని ఆయన వాదించారు. "దేశభక్తిని బలవంతంగా రుద్దలేరు. వ్యక్తిగత అంతరాత్మను కాపాడాల్సిన బాధ్యత రాజ్యాంగంపై ఉంది" అని ఆయన నివేదించారు. అయితే, పిటిషనర్ వ్యక్తం చేస్తున్న ఆందోళనలు ప్రస్తుతానికి ఊహాజనితమేనని ధర్మాసనం అభిప్రాయపడింది. ఒకవేళ ఎవరిపైనైనా శిక్షార్హమైన చర్యలు తీసుకున్నా లేదా వివక్ష చూపినా, అప్పుడు మళ్లీ కోర్టును ఆశ్రయించవచ్చని సూచిస్తూ పిటిషన్‌ను కొట్టివేసింది. విద్యాసంస్థలు, బహిరంగ సభల్లో వందేమాతరం పాడాలని కేంద్రం సర్క్యులర్‌లో సూచించింది. ఇది కేవలం జాతీయ గేయంపై గౌరవాన్ని పెంపొందించడానికేనని, చట్టబద్ధంగా అమలు చేయాలనే ఉద్దేశం లేదని ప్రభుత్వం స్పష్టం చేసింది. వందేమాతరం స్ఫూర్తి గురించి ఇటీవల ప్రధాని నరేంద్ర మోదీ లోక్‌సభలో ప్రస్తావించడం గమనార్హం. బంకించంద్ర చటోపాధ్యాయ 1875లో రచించిన ఈ గేయం, స్వాతంత్ర్య పోరాటంలో ప్రజలను ఏకతాటిపై నడిపించిందని కొనియాడారు. రవీంద్రనాథ్ ఠాగూర్ స్వరపరిచిన ఈ గీతాన్ని 1896లో కాంగ్రెస్ సమావేశంలో తొలిసారి ఆలపించారు. 1950లో అప్పటి రాష్ట్రపతి బాబూ రాజేంద్రప్రసాద్ దీనికి జాతీయ గేయం హోదా కల్పించారు.



వయ్యారి చిత్రం



యుక్తి తరేజా





## వారణాసి మరో ప్రపంచం

**ఎస్ఎస్ రాజమౌళి మరోసారి తన అద్భుతమైన విజన్‌తో సినీ ప్రపంచాన్ని ఆశ్చర్యపరుస్తున్నారు. ప్రస్తుతం 'సూపర్ స్టార్' మహేష్ బాబుతో 'వారణాసి' చిత్రాన్ని జక్కన్న తెరకెక్కిస్తున్నారు. ఈ భారీ ప్రాజెక్ట్ కోసం వారణాసి నేపథ్యాన్ని పునర్నిర్మిస్తూ.. మినియేచర్ సెట్స్ రూపంలో ఘాట్లు, వీధులు, ఆలయాలను అద్భుతంగా తీర్చిదిద్దుతున్నారు. ఈ సెట్స్‌కు సంబంధించిన విజువల్స్ సోషల్ మీడియాలో వైరల్ కాగా.. రాజమౌళి విజన్‌కు అభిమానులను ఫిదా అవుతున్నారు**

వారణాసి వంటి ఆధ్యాత్మిక నగరాన్ని రియలిస్టిక్‌గా తెరపై చూపించడం సాధారణ విషయం కాదు. కానీ ఎస్ఎస్ రాజమౌళి మాత్రం అసాధ్యాన్ని సుసాధ్యం చేస్తూ ముందుకు సాగుతున్నారు. ఘాట్ల ప్రత్యేకత, వీధుల నిర్మాణం, ఆలయాల వాతావరణం.. ఇలా అన్నింటిని ఎంతో స్పష్టంగా ప్రతిబింబించేలా సెట్స్ డిజైన్ చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇది కేవలం ఒక సినిమా సెట్స్ కాకుండా.. ఒక కళాఖండంలా రూపొందుతోంది. రాజమౌళి సినిమాలంటే విజువల్ గ్రాండియర్, డిటైలింగ్‌కు ప్రత్యేక గుర్తింపు ఉంది. ఈ ప్రాజెక్ట్‌లో కూడా అదే స్థాయిలో కష్టపడి.. ప్రపంచ స్థాయి ప్రమాణాలతో పని చేస్తున్నారని ఈ సెట్స్ ద్వారా స్పష్టమవుతోంది. ఇతరులు ఊహించలేని విధంగా కథను, విజువల్స్‌ను ఆవిష్కరించడం రాజమౌళి ప్రత్యేకత. ఇప్పుడు వారణాసి సెట్స్ రూపంలో ఆ విజన్ మరోసారి బయటపడింది.

మహేష్ బాబు కెరీర్‌లో వారణాసి అత్యంత భారీ, ప్రతిష్ఠాత్మక ప్రాజెక్ట్‌గా భావిస్తున్నారు. ఇప్పటికే ఈ సినిమా పై అంచనాలు ఆకాశాన్ని తాకుతున్నాయి. రాజమౌళి విజన్, మహేష్ బాబు స్టార్ పవర్ కలిస్తే.. ఈ సినిమా ప్రపంచ స్థాయిలో కొత్త రికార్డులు సృష్టించడం ఖాయమనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. మొత్తానికి వారణాసి మినియేచర్ సెట్స్‌తో రాజమౌళి మరోసారి తన సృజనాత్మకతకు నిదర్శనం చూపించారు. ఈ ప్రాజెక్ట్ నుంచి వచ్చే ప్రతి అప్డేట్ అభిమానుల్లో మరింత ఉత్సాహాన్ని పెంచుతోంది. ఇక ఈ విజన్ తెరపై ఎలా కనిపిస్తుందో చూడాలని సినీ ప్రేమికులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

## ఆ డైరెక్టర్ లైంగికంగా వేధించాడు



ప్రయాగ్‌రాజ్ మహా కుంభమేళా ఫోటోలతో ఓవర్ నైట్ స్టార్‌గా మారిన మోనాలిసా తన మొదటి సినిమా దర్శకుడు సనోజ్ మిశ్రాపై షాకింగ్ ఆరోపణలు చేసింది. షూటింగ్ సెట్‌లో తన పట్ల ఆయన ప్రవర్తన అస్సలు బాలేదని, లైంగికంగా వేధించారని ఆవేదన వ్యక్తం చేసింది సీన్ వివరించే నెపంతో తన శరీరాన్ని పదే పదే తాకుతూ అసౌకర్యానికి గురిచేశారని ఆరోపించింది. అప్పట్లో తనకు 18 ఏళ్లు కూడా నిండలేదని, ఏం చేయాలో తెలియక భయంతో వణికిపోయానని కన్నీళ్లు పెట్టుకుంది. కేవలం మోనాలిసా మాత్రమే కాదు, గతంలో మరో యువతి కూడా ఈ దర్శకుడిపై తీవ్రమైన ఆరోపణలు చేసింది. సినిమా ఛాన్స్ ఇస్తానని నమ్మించి, మోసం చేశాడని ఆమె ఫిర్యాదు చేసింది. ఇక అంతేకాకుండా, ఆమె వీడియో తీసి తనను బ్లాక్ మెయిల్ చేస్తూ పలుమార్లు అఘాయిత్యానికి పాల్పడినట్లు పేర్కొంది. ఈ కేసులో పోలీసులు గతంలో సనోజ్ మిశ్రాను అరెస్ట్ కూడా చేశారు. అయితే ఆయన తర్వాత బెయిల్‌పై విడుదలయ్యారు. మోనాలిసా ఆరోపణలపై దర్శకుడు సనోజ్ మిశ్రా స్పందిస్తూ.. ఆమె సినిమా కోసం తాము కోట్లాది రూపాయలు ఖర్చు చేశామని, ఆమె అకస్మాత్తుగా పెళ్లి చేసుకోవడం వల్ల సినిమా దెబ్బతింటుందని వాదిస్తున్నారు.




## హాయిగా.. ఎంజాయ్‌గా.. విరోష్ హనీమూన్!

విజయ్ దేవరకొండ– రష్మిక మందన్న జంట హనీమూన్ ట్రిప్ పై నెటిజన్లలో ఆసక్తికర చర్చ మొదలైంది. అందుకు సంబంధించిన పిక్స్, వీడియోలను పోస్ట్ చేయడంతో తెగ చక్కర్లు కొడుతున్నాయి. హనీమూన్ ట్రిప్ కు సంబంధించిన ఫోటోలు, వీడియోలు బయటకు రావడంతో అభిమానులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. అదే సమయంలో ఆ ట్రిప్ పై మరో యాంగిల్ లో చర్చలు కూడా మొదలయ్యాయి. నెటిజన్లలో కొందరు విరోషన్ హనీమూన్ పూర్తిగా స్పాన్సర్డ్ ట్రిప్ అయి ఉండొచ్చని అభిప్రాయపడుతున్నారు. ప్రత్యేకంగా వారు ఉన్న లగ్జరీ ఎయిర్‌బీఎన్‌బీ రిసార్ట్, అక్కడి సౌకర్యాలు, సందర్శించిన ప్రదేశాలు.. వాటన్నింటినీ చూస్తుంటే బ్రాండ్ ప్రమోషన్స్ లా కనిపిస్తున్నాయని అంటూ సోషల్ మీడియాలో కామెంట్లు కనిపిస్తున్నాయి. వీడియోల్లో ఆ ప్రదేశాల ప్రత్యేకతలను హైలైట్ చేయడం వల్ల అనుమానాలు మరింత పెరిగాయి.




## ఏంటో ఈ కాలపు డైరెక్టర్లు: అమీషా పటేల్

బాలీవుడ్ సీనియర్ నటి అమీషా పటేల్ చిత్ర పరిశ్రమలోని ప్రస్తుత పోకడలపై చేసిన వ్యాఖ్యలు సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారాయి. నేటి కాలపు దర్శకులు నటీనటులను ఎంచుకునే విధానంపై ఆమె వేసిన సెటైర్లు ఇండస్ట్రీలో చర్చకు దారి తీస్తున్నాయి. ప్రతిభ కంటే సోషల్ మీడియా ఫాలోయింగ్‌కే ప్రాధాన్యత ఇస్తున్నారంటూ అమ్మడు చేసిన విమర్శలు నెటిజన్లను ఆలోచింపజేస్తున్నాయి. ప్రస్తుతం బాలీవుడ్‌లో కాస్టింగ్ అనేది కేవలం నటన ఆధారంగా కాకుండా ఇన్‌స్టాగ్రామ్ ఫాలోవర్ల సంఖ్యపై ఆధారపడి జరుగుతోందని అమీషా అసహనం వ్యక్తం చేశారు. –ఈ రోజుల్లో చాలా మంది దర్శకులు కేవలం ఇన్‌స్టాగ్రామర్లనే సినిమాల్లోకి తీసుకుంటున్నారు. ఒక నటుడికి ఎన్ని మిలియన్ల ఫాలోవర్లు ఉన్నారన్నదే ముఖ్యం తప్ప వారికి ఎంత నటన వచ్చు అనేది ఎవరూ చూడటం లేదు– అంటూ ఆమె తాజా ట్రెండ్‌పై ఘాటు గా స్పందించారు. ఇదే క్రమంలో అమీషా ధురంధర్ 2 దర్శకుడు ఆదిత్య ధర్ పై ప్రశంసల వర్షం కురిపించారు. మిగతా దర్శకులలా కాకుండా ఆదిత్య ధర్ కేవలం నటన సామర్థ్యం ఉన్న నిజమైన నటులను మాత్రమే తన సినిమా కోసం ఎంచుకున్నారని కొనియాడారు.



## రేపే పెద్ది టీజర్ విడుదల

మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ హీరోగా తెరకెక్కుతున్న 'పెద్ది' సినిమా టీజర్ విడుదలపై గత కొంతకాలంగా వార్తలు వినిపిస్తున్న విషయం తెలిసిందే. తాజాగా ఈ విషయంపై చిత్రబృందం అధికారిక ప్రకటన విడుదల చేసింది. చిత్ర యూనిట్ వెల్లడించిన వివరాల ప్రకారం, ఈ సినిమా టీజర్‌ను మార్చి 27వ తేదీన ఉదయం 11 గంటల 07 నిమిషాలకు విడుదల చేయనున్నట్లు ప్రకటించారు. ఇప్పటికే ఈ సినిమా నుంచి విడుదలైన ప్రచార చిత్రాలు ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకోవడంతో, టీజర్‌పై భారీ స్థాయిలో అంచనాలు నెలకొన్నాయి. టీజర్ ప్రేక్షకులను ఏ స్థాయిలో ఆకట్టుకుంటుందో అన్నది ఆసక్తిగా మారింది. ఈ చిత్రంలో బాలీవుడ్ నటి జాన్వి కపూర్ హీరోయిన్‌గా నటిస్తుండగా, దర్శకుడు బుచ్చిబాబు సనా దర్శకత్వం వహిస్తున్నారు. ప్రముఖ సంగీత దర్శకుడు ఏఆర్ రెహమాన్ సంగీతాన్ని అందిస్తున్నారు. ఈ చిత్రంలో ప్రముఖ నటులు శివరాజ్ కుమార్, జగపతిబాబు, దివ్యాంధు తదితరులు ముఖ్యపాత్రల్లో కనిపించనున్నారు. వృద్ధి సినిమాస్ బ్యానర్‌పై ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.



## జపాన్ మంచులో సాయిపల్లవి 'ఒక రోజు'

నటి సాయిపల్లవి బాలీవుడ్ ఎంట్రీ కోసం ఎదురుచూస్తున్న అభిమానులకు ఒక గుడ్ న్యూస్ వచ్చింది. ఆమె నటించిన తొలి హిందీ చిత్రం 'ఏక్ దిన్' ఇప్పుడు తెలుగులో 'ఒక రోజు' పేరుతో ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. అమీర్ ఖాన్ కుమారుడు జునైద్ ఖాన్ హీరోగా రాబోతున్న ఈ సినిమాను అమీర్ ఖాన్ ప్రొడక్షన్స్ అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మించింది. తాజాగా ఈ చిత్రానికి సంబంధించిన అధికారిక తెలుగు ట్రైలర్‌ను చిత్రబృందం విడుదల చేసింది. జపాన్ మంచు కొండల నేపథ్యంలో సాగే ఈ సుందరమైన ప్రేమకథలో సాయిపల్లవి తన సహజ సిద్ధమైన నటనతో మరోసారి మాయ చేయబోతున్నట్లు సమాచారం. ట్రైలర్ చూస్తుంటే.. కేవలం ఒకే ఒక్క రోజులో జరిగిన పరిణామాలు ఇద్దరు వ్యక్తుల జీవితాలను ఎలా మార్చాయనే ఆసక్తికరమైన కథాంశంతో ఈ సినిమా తెరకెక్కింది.



# చెన్నైలో ఆ ఐదుగురు!

ఐపీఎల్ 19వ సీజన్‌లో సీఎస్కే ఓ కొత్త ఉత్సాహంతో బరిలోకి దిగుతోంది. గత సీజన్‌లో పాయింట్ల పట్టికలో అట్టడుగున నిలిచిన ఐదుసార్లు ఛాంపియన్ సీఎస్కే.. ఈ సారి జట్టులో భారీ మార్పులు చేసింది. మార్చి 30న గౌహతిలోని రాజస్థాన్ రాయల్స్ జట్టుతో జరిగే మ్యాచ్‌లో చెన్నై సూపర్ కింగ్స్ తన ప్రయాణాన్ని ప్రారంభించనుంది. అయితే ఈ సారి జట్టును విజేతగా నిలిపే బాధ్యత ధోనీ భుజాలపై కాకుండా.. మరో ఐదుగురు కీలక ఆటగాళ్లపై ఉంది.

**1. సంజు శాంసన్:**

ఈ సీజన్‌లో చెన్నై సూపర్ కింగ్స్ తీసుకున్న అత్యంత సంచలన నిర్ణయం స్టార్ క్రికెటర్ సంజు శాంసన్‌ను జట్టులోకి తీసుకురావడమే. రాజస్థాన్ రాయల్స్ జట్టుతో జరిగిన చారిత్రాత్మక ట్రేడ్‌లో భాగంగా రవీంద్ర జడేజా, సామ్ కరన్‌లను ఇచ్చి రూ.18 కోట్లకు సంజును చెన్నై దక్కించుకుంటుంది. ప్రస్తుతం సంజు శాంసన్ భీకరమైన ఫామ్‌లో ఉన్నాడు. ఇటీవల ముగిసిన టీ20 ప్రపంచ కప్ 2026 సెమీఫైనల్, ఫైనల్స్‌లో తనదైన శైలిలో క్లాస్ అండ్ ఊరమాస్ ఇన్నింగ్స్ ఆడి 'ప్లేయర్ ఆఫ్ ది టోర్నమెంట్'గా నిలిచాడు. 177 ఐపీఎల్ ఐపీఎల్ మ్యాచ్‌ల అనుభవంతో సంజు శాంసన్ ఇప్పుడు ధోనీ వారసత్వాన్ని ముందుకు తీసుకెళ్లడానికి సిద్ధంగా ఉన్నాడు.

**2. రుతురాజ్ గైక్వాడ్:**

చెన్నై సూపర్ కింగ్స్ కెప్టెన్‌గా రుతురాజ్ గైక్వాడ్ తన ప్రయాణాన్ని కొనసాగిస్తున్నాడు. గత సీజన్‌లో గాయం వల్ల టోర్నీ మధ్యలోనే తప్పుకోవాల్సి రావడంతో జట్టు బిగ్ షాక్ తగిలింది. 2021లో ఆరెంజ్ క్యాప్ సాధించి సీఎస్కేను ఛాంపియన్ గా నిలబెట్టిన రుతురాజ్.. ఈ సారి యువ జట్టును ముందుండి నడిపించనున్నాడు. జట్టు మొత్తం రుతురాజ్ గైక్వాడ్ బ్యాటింగ్ చుట్టూనే కేంద్రీకృతమై ఉంది.

**3. నూర్ అహ్మద్:**

రవీంద్ర జడేజా జట్టును వీడిన అనంతరం సీఎస్కే ప్రధాన స్పిన్ అస్త్రంగా అఫ్గానిస్థాన్‌కు చెందిన నూర్ అహ్మద్ నిలిచాడు. 2025 మెగా వేలంలో రూ.10 కోట్లకు అమ్ముడైన నూర్ అహ్మద్.. గత సీజన్‌లో 24 వికెట్లతో అదరగొట్టాడు. చెపాక్ స్టేడియంలోని టర్నింగ్ పిచ్‌లపై నూర్ అహ్మద్ ప్రత్యర్థి బ్యాటర్లకు సింహస్వప్నంగా మారనున్నాడు.

**4.డెవాల్డ్ బ్రెవిస్:**

దక్షిణాఫ్రికా సెన్సేషన్ డెవాల్డ్ బ్రెవిస్ గతేడాది రీప్లేస్‌మెంట్ ప్లేయర్‌గా వచ్చి 180 స్ట్రైక్ రేట్‌తో అందరినీ ఆశ్చర్యపరిచాడు. టీ20 ప్రపంచ కప్‌లోనూ అద్భుతమైన ఫామ్‌ను కనబరిచిన డెవాల్డ్ బ్రెవిస్.. మిడిల్ ఓవర్లలో వేగంగా పరుగులు రాబట్టడంలో కీలక పాత్ర పోషించనున్నాడు.

**5. ఆయుష్ మాత్రే:**

కేవలం 17ఏళ్లలోనే ఆయుష్ మాత్రే సంచలనం సృష్టిస్తున్నాడు. గత సీజన్ అరంగేట్రంలోనే తన దూకుడు బ్యాటింగ్‌తో ఆకట్టుకున్న ఈ కుర్రాడు.. ఇటీవల భారత్‌కు అండర్-19 ప్రపంచ కప్ 2026 టైటిల్ ను అందించిన కెప్టెన్ గా నిలిచాడు. మిడిలార్డర్ లో వేగంగా ఆడటమే కాకుండా.. జట్టులో గెలుపు ఆశలను రేకెత్తించడంలో ఆయుష్ మాత్రే కీలకం కానున్నాడు.



## ఆర్సీబీకీ ఉందో అందాల తార

ఐపీఎల్ 2026 సీజన్‌కు ముందు ఆర్సీబీ జట్టు యాజమాన్యంలో సంచలన మార్పు జరిగింది. బ్రిటన్‌కు చెందిన డియాజియో గ్రూప్ నుంచి ఈ జట్టును ఆదిత్య బిర్లా గ్రూప్ నేతృత్వంలోని కన్సార్టియం ఏకంగా రూ.16,700 కోట్లకు కొనుగోలు చేసింది. ఈ చారిత్రాత్మక డీల్‌తో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు పురుషుల, మహిళ జట్ల బాధ్యతలను బిర్లా కుటుంబం చేపట్టనుంది. కుమార మంగళం బిర్లా తనయుడు ఆర్యమన్ బిర్లా ఛైర్మన్‌గా వ్యవహరించనుండగా.. ఆయన సోదరి అనన్య బిర్లా ఇప్పుడు సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారారు. సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టుకు కావ్యమారన్ ఎలాగైతే ఓ ఐకాన్‌గా మారిపోయారో.. ఇప్పుడు ఆర్సీబీకి అనన్య బిర్లా అదే స్థాయిలో గుర్తింపు తెస్తారని ఫ్యాన్స్ భావిస్తున్నారు. పంజాబ్ కింగ్స్ జట్టుకు ప్రీతి జింటా, సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టుకు కావ్య మారన్ గ్లామర్ అదనపు ఆకర్షణగా నిలుస్తుండగా.. ఇకపై ఆర్సీబీ ఆడే ప్రతి మ్యాచ్‌లోనూ అనన్య బిర్లా స్టాండ్స్‌లో ఉండి జట్టును ఉత్సాహపరచనున్నట్లు తెలుస్తోంది. దీంతో సోషల్ మీడియాలో "మాకు కూడా ఓ అందాల తార(అనన్య పాప) వచ్చేసింది" అంటూ ఆర్సీబీ అభిమానులు పండగ చేసుకుంటున్నారు.



## షేన్ వార్న్ ఫ్యామిలీకి వందల కోట్లు!

స్టేడియంలో తన స్పిన్ మాయాజాలంతో బ్యాటర్లను ముప్పుతిప్పలు పెట్టిన ఆసీస్ దిగ్గజం షేన్ వార్న్.. మైదానం బయట కూడా అంతే గొప్ప వ్యూహకర్త అని నిరూపించుకున్నాడు. రాజస్థాన్ రాయల్స్ జట్టు రికార్డు ధరకు అమ్ముడవ్వడంతో 18 ఏళ్ల క్రితం షేన్ వార్న్ చేసిన ఓ ఒప్పందం ఇప్పుడు ఆయన కుటుంబానికి కోట్ల వర్షం కురిపిస్తోంది. 2008లో ఐపీఎల్ ప్రారంభమైనప్పుడు రాజస్థాన్ రాయల్స్ జట్టు షేన్ వార్న్‌ను కెప్టెన్‌గా, మెంటర్‌గా నియమించుకుంది. ఆ సమయంలో షేన్ వార్న్ ఓ వినూత్నమైన ఒప్పందం చేసుకున్నాడు. ఆయనకు ఇచ్చే వార్షిక వేతనంతో పాటు ప్రతి ఏడాది ఆడినందుకు జట్టులో 0.75 శాతం వాటా ఇచ్చేలా ఒప్పందం కుదిరింది. ఇలా నాలుగు సీజన్ల పాటు జట్టుతో కొనసాగిన షేన్ వార్న్.. రాజస్థాన్ రాయల్స్‌లో మొత్తం 3 శాతం వాటాను సొంతం చేసుకున్నాడు. ఐపీఎల్ 2026 ప్రారంభానికి ముందే రాజస్థాన్ రాయల్స్ జట్టు యాజమాన్యం మారింది. అమెరికాకు చెందిన ఓ కన్సార్టియం ఈ జట్టును 1.63 బిలియన్ డాలర్లకు(సుమారు రూ.15,290 కోట్లు) కొనుగోలు చేసింది. 2008లో కేవలం 67 మిలియన్ డాలర్లకు కొనుగోలు చేసిన రాజస్థాన్ రాయల్స్ జట్టు విలువ ఇప్పుడు ఆకాశాన్ని తాకింది. ఈ భారీ డీల్ కారణంగా షేన్ వార్న్ వాటా విలువ కూడా ఊహించని స్థాయికి చేరింది. ప్రస్తుత మార్కెట్ విలువ ప్రకారం రాజస్థాన్ రాయల్స్ జట్టులో షేన్ వార్న్ కుటుంబానికి ఉన్న 3 శాతం వాటా విలువ రూ. 450 కోట్ల నుంచి రూ.460 కోట్ల మధ్య ఉంటుందని అంచనా.

## ధోనీ రిటైర్మెంట్‌పై దాదా 'నో కామెంట్స్'



2026: ఐపీఎల్ 2026 సీజన్ కౌంట్ డౌన్ కొనసాగుతున్న వేళ క్రికెట్ ప్రపంచంలో అభిమానులును ఓ ప్రశ్న వెంటాడుతోంది. అదే 'ఎంఎస్ ధోనీకి ఇదే చివరి ఐపీఎల్ సీజనా?' అనే ప్రశ్న ప్రతి ఒక్కరి మదిలో మెదులుతోంది. 44 ఏళ్ల వయస్సులో తన 19వ ఐపీఎల్ సీజన్‌కు సిద్ధమవుతున్న నేపథ్యంలో ధోనీ రిటైర్మెంట్‌పై గత కొన్నాళ్లుగా ఊహాగానాలు వస్తున్న సంగతి తెలిసిందే. అయితే తాజాగా టీమిండియా మాజీ కెప్టెన్ సౌరవ్ గంగూలీ ఈ విషయంపై ఇంట్రెస్టింగ్ కామెంట్స్ చేశారు.

## షాక్ ఇచ్చిన గిల్లెస్పీ



పాకిస్థాన్ టెస్ట్ జట్టు మాజీ ప్రధాన కోచ్ జేసన్ గిలెస్పీ మళ్లీ ఆ దేశానికి తిరిగి వచ్చారు. అయితే ఈ సారి జాతీయ జట్టు కోసం కాకుండా పాకిస్థాన్ సూపర్ లీగ్(పీఎస్ఎల్ 2026) ఫ్రాంచైజీ 'హైదరాబాద్ కింగ్స్‌మెన్' కోచ్‌గా ఆయన బాధ్యతలు చేపట్టారు. అయితే అడుగుపెట్టిన మొదటి రోజే తనదైన కఠిన వైఖరిని ప్రదర్శించి నెట్టింట హాట్ టాపిక్‌గా నిలిచారు. సాధారణంగా ఏ జట్టులోకైనా కొత్త కోచ్ లేదా ఆటగాడు వచ్చినప్పుడు హోటల్ వద్ద గ్రాండ్‌గా స్వాగతం చెబుతూ.. "అరైవల్ వీడియోలు" షూట్ చేయడం ఆనవాయితీ. హైదరాబాద్ కింగ్స్‌మెన్ జట్టు యాజమాన్యం కూడా కోచ్ గిలెస్పీతో అలాంటి వీడియో తీయాలని ప్లాన్ చేసింది. అయితే కెమెరా ముందే ఆయన దానిని నిర్మొహమాటంగా తిరస్కరించారు. "నేను కిందకు రాను.. నాకు చాలా పని ఉంది. ఆ పిచ్చి పిచ్చి అరైవల్ వీడియోల్లో నేను నటించను" అని కోచ్ గిలెస్పీ తెగేసి చెప్పాడు. దీనికి సంబంధించిన వీడియో ప్రస్తుతం నెట్టింట వైరల్ అవుతోంది. గిలెస్పీ ఇంత కఠినంగా ఉండడానికి పీసీబీతో ఆయనకు ఉన్న చేదు అనుభవాలే కారణమని విశ్లేషకులు భావిస్తున్నారు. గతంలో పాక్ టెస్ట్ జట్టు కోచ్‌గా ఉన్నప్పుడు తనకు కనీసం సమాచారం ఇవ్వకుండా అసిస్టెంట్ కోచ్ ను తొలగించడంపై గిలెస్పీ తీవ్రంగా మండిపడ్డారు. హెడ్ కోచ్‌గా తనను అవమానించారని.. పీసీబీ ఛైర్మన్ మొహ్సిన్ నక్వీ కనీసం మీటింగ్‌లకు కూడా సరిగ్గా హాజరుకాకపోవడంపై ఆయన అప్పట్లోనే ట్విట్టర్ వేదికగా మండిపడ్డారు. ఆ పాత గాయాల వల్లే ఇప్పుడు కేవలం తన పని మీద మాత్రమే దృష్టి పెడతానని.. అనవసరపు హంగూ ఆర్భాటాలకు దూరంగా ఉంటానని ఆయన స్పష్టం చేస్తున్నారు.




## టికెట్లు అమ్ముడుపోవడంపై ఫ్యాన్స్ ఫైర్

ఐపీఎల్ 19వ సీజన్ ప్రారంభానికి ముందే వివాదాలు మొదలయ్యాయి. మార్చి 28న రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు, సన్‌రైజర్స్ హైదరాబాద్ మధ్య జరగనున్న తొలి మ్యాచ్ కోసం క్రికెట్ అభిమానులు ఎంతో ఆతృతగా ఎదురుచూశారు. ఈ ప్రారంభ మ్యాచ్ టికెట్ల బుకింగ్ మొదలైన కొద్ది నిమిషాల్లోనే ముగిసిపోవడంతో క్రికెట్ ఫ్యాన్స్ ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మంగళవారం సాయంత్రం 4 గంటలకు టికెట్ల బుకింగ్ ప్రారంభం కాగా.. కేవలం కొన్ని నిమిషాల్లోనే 'సోల్డ్ అవుట్' బోర్డులు కనిపించడంతో వేలాది మంది అభిమానులు నిరాశకు గురయ్యారు. ఈ క్రమంలో టికెటింగ్ ప్రక్రియలో పారదర్శకత లేదని, బ్లాక్ మార్కెటింగ్ జరుగుతోందని సోషల్ మీడియా వేదికగా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ హై-వోల్టేజ్ మ్యాచ్ కోసం టికెట్ ధరలను నిర్వాహకులు భారీగానే నిర్ణయించారు. సామాన్య అభిమానుల కోసం కనీస ధర రూ.3.750 ఉండగా.. లగ్జరీ సీట్ల ధర రూ.47,000 వరకు ఉంది. ఈ మ్యాచ్ బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియంలో జరగనుంది.



## సింగపూర్‌లో ఎంజాయ్ చేస్తున్న గంభీర్

టీమిండియా హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ ప్రస్తుతం కుటుంబంతో కలిసి సరదాగా గడుపుతున్నాడు. ఇటీవల ముగిసిన టీ20 ప్రపంచకప్ 2026లో భారత్‌కు చారిత్రక విజయాన్ని అందించిన తర్వాత గౌతీ విరామం తీసుకున్నాడు. సింగపూర్‌లో తన భార్య నటాషా, కుమార్తెలు అజీన్, అనైజాతో కలిసి వెకేషన్‌ను ఆస్వాదిస్తున్నాడు. సింగపూర్ వీధుల్లో సాధారణ దుస్తుల్లో కనిపించిన గంభీర్, తన చిన్న కుమార్తెను భుజాలపై ఎక్కించుకుని నడుస్తూ కనిపించాడు. 2007లో టీ20 ప్రపంచకప్ గెలిచిన భారత జట్టులో కీలక ఆటగాడిగా ఉన్న గంభీర్, ఇప్పుడు కోచ్‌గానూ కప్ సాధించి అరుదైన ఘనతను తన ఖాతాలో వేసుకున్నాడు. రాహుల్ ద్రవిడ్, లాల్‌చంద్ రాజ్‌పుత్ తర్వాత ఈ ఘనత సాధించిన కోచ్‌గా నిలిచాడు. ఐపీఎల్ 2024లో కోల్‌కతా నైట్ రైడర్స్‌ను ఛాంపియన్‌గా నిలిపిన తర్వాతే గౌతీ భారత జట్టు హెడ్ కోచ్‌గా నియమితులయ్యాడు. ఇక, టీమిండియా తదుపరి సిరీస్ జూన్‌లో ఆఫ్ఘనిస్థాన్‌తో జరగనుంది. ఈ పర్యటనలో ఒక టెస్ట్, మూడు వన్డేలు ఆడనుంది. ఆ తర్వాత ఐర్లాండ్, ఇంగ్లండ్ పర్యటనలకు వెళ్లనుంది.

ఈవార్తలు
# ప్రజావాణి
గురువారం 26-3-2026, జగిత్యాల
www.evarthalu.com
నేటి ఈవార్తలు

నేటి ఈవార్తలు **సంపాదకీయం** Editorial

# విశ్వాసం లేని ఢాకా

ఒక దేశం తన ఉనికి కోసం పోరాడుతున్నప్పుడు ఆపన్నహస్తం అందించి, రక్తాన్ని ధారబోసి స్వాతంత్ర్యం తెచ్చిపెట్టిన పొరుగు దేశం పట్ల కృతజ్ఞతతో ఉండటం కనీస ధర్మం. 1971లో పాకిస్థాన్ చెర నుండి బంగ్లాదేశ్‌ను విముక్తం చేసేందుకు భారత్ చేసిన త్యాగాలు సామాన్యమైనవి కావు. కానీ, నేడు ఢాకా వీధుల్లో వినబడుతున్న భారత్ వ్యతిరేక నినాదాలు, ఆ దేశ ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలు ఆనాటి చారిత్రక బంధాన్ని వెక్కిరిస్తున్నాయి. దశాబ్ద కాలంగా 'స్వర్ణ యుగం'గా పిలువబడిన భారత్-బంగ్లా సంబంధాలు, 2024 ఆగస్టులో షేక్ హసీనా ప్రభుత్వం కూలిపోయిన తర్వాత ఒక్కసారిగా తలకిందులయ్యాయి. విద్యార్థుల నిరసనలతో మొదలైన ఉద్యమం చివరకు భారత్ పట్ల వ్యతిరేకతగా రూపాంతరం చెందడం ఆందోళనకరం. భారత్ ఆశ్రయం పొందిన హసీనాను అప్పగించాలని కోరడం, ఆమెను దోషిగా నిలబెట్టడం ద్వారా ఢాకా తన అసహనాన్ని ప్రదర్శిస్తోంది. బంగ్లాదేశ్‌లో నెలకొన్న అస్థిరతను అడ్డం పెట్టుకుని భారత్ వ్యతిరేక శక్తులు, ముఖ్యంగా మతవాద సంస్థలు పడగ విప్పుతున్నాయి. ఇండియా అవుట్ వంటి ప్రచారాలు ప్రజాభిప్రాయాన్ని విషతుల్యం చేస్తున్నాయి. హిందూ మైనారిటీలపై దాడులు పెరగడం, భారత దౌత్య కార్యాలయాలపై విద్రోహ చర్యలు చేపట్టడం వంటి ఘటనలు ఇరు దేశాల మధ్య విశ్వాసాన్ని దెబ్బతీస్తున్నాయి. 2026 నాటికి గంగా నదీ జలాల ఒప్పందం ముగియనుండటం, తీస్తా నదీ జలాల పంపిణీపై ఇంకా స్పష్టత లేకపోవడం సమస్యగా మారింది. బంగ్లాదేశ్ తన రక్షణ, మౌలిక సదుపాయాల కోసం చైనా వైపు మొగ్గు చూపడం భారత్ భద్రతకు సవాలుగా పరిణమించింది. చొరబాటు యత్నాలు పెరగడం, సరిహద్దు వద్ద ఉద్రిక్తతలు ఇరు దేశాల మధ్య అగాధాన్ని పెంచుతున్నాయి. బంగ్లాదేశ్ గడ్డపై భారత్ చిందించిన రక్తం ఆ దేశ స్వాతంత్ర్యానికి పునాది  రాజకీయ మార్పులు సహజమే అయినా, పొరుగు దేశంతో శత్రుత్వం ఏ దేశ ఆర్థిక ప్రగతికీ క్షేమకరం కాదు. ఢాకా పాలకులకు ఈ సత్యాన్ని ఎంత త్వరగా గ్రహిస్తే అంత మంచిది. ద్వేషంతో కాకుండా, నిర్మాణాత్మక చర్చల ద్వారా సమస్యలను పరిష్కరించుకోవడమే రెండు దేశాల ఉమ్మడి ప్రయోజనం.



భారతీయ జీవన స్రవంతిలో 'రామ' నామం ఒక మంత్రం మాత్రమే కాదు, అది ఒక సంస్కృతి, ఒక జీవన విధానం. వేల ఏళ్లు గడిచినా, తరాలు మారినా 'రామరాజ్యం' అనేది నేటికీ ఒక ఆదర్శ పాలనకు తిరుగులేని ప్రమాణంగా నిలిచి ఉంది. శ్రీరామనవమి పర్వదినం కేవలం ఒక వేడుక కాదు; ధర్మాన్ని, నైతికతను, బాధ్యతను పునశ్చరణ చేసుకునే సందర్భం. రాముడు ఏలిన నేల అంటే కేవలం భౌగోళిక సరిహద్దులు కావు; అది నైతిక విలువల పునాదుల మీద నిర్మితమైన సామ్రాజ్యం. నేటి ఆధునిక రాజకీయాల్లో 'సుపరిపాలన' గురించి మనం మాట్లాడుకుంటున్నాం. కానీ, ఆనాడు రాముడు అడవులకు వెళ్తూ కూడా అయోధ్య ప్రజల యోగక్షేమాలను భరతుడికి వివరించిన తీరు, పాలకుడు ప్రజలకు ఎలా జవాబుదారీగా ఉండాలో నేర్పుతుంది. ఒక సామాన్యుడి విమర్శకు కూడా విలువనిచ్చి, రాజధర్మాన్ని పాటించిన రాముడి తీరు.. నేటి ప్రజా స్వామ్య వ్యవస్థలో పాలకులకు అతిపెద్ద పాఠం.


# రాముడు ఏలిన నేలన..!



రణధీర్ గుండు

నేటి భారతదేశం ఆర్థికంగా, సాంకేతికంగా దూసుకుపోతోంది. అయితే, అభివృద్ధి ఎంత ముఖ్యమో, సామాజిక సమరసత అంతే ముఖ్యం. కులమతాలకు అతీతంగా గిరిజన సోదరుడు గుహుడిని కౌగిలించుకున్నా, శబరి పెట్టిన ఎంగిలి పండ్లను ఆరగించినా, వానర సైన్యాన్ని కలుపుకుని లంకను జయించినా.. అందులో ఉన్నది 'సమ్మిళిత వృద్ధి'. సమాజంలోని అట్టడుగు వర్గాలను కలుపుకుపోయినప్పుడే నిజమైన రామరాజ్యం సాధ్యమని ఆ చర్యలు నిరూపిస్తున్నాయి. సత్యం, అహింస, ఏకపత్నీ వ్రతం వంటి వ్యక్తిగత విలువలే రాముడిని 'మర్యాద పురుషోత్తముడి'ని చేశాయి. నేటి యువతకు రాముడు ఒక రోల్ మోడల్. అధికార కాంక్షతో ధర్మాన్ని విస్మరించకూడదని, తండ్రి మాటకు కట్టుబడి రాజ్యత్యాగం చేసిన ఆయన జీవితం నేర్పుతుంది. అవినీతి, స్వార్థం రాజ్యమేలుతున్న ప్రస్తుత తరుణంలో 'ధర్మమే జయిస్తుంది' అన్న రాముడి నమ్మకం మనకు దిశానిర్దేశం చేయాలి. అయోధ్యలో రామమందిర నిర్మాణం పూర్తయి, రామలల్లా కొలువైన ఈ వేళ.. భారతీయులందరిలో ఒక నూతన ఉత్తేజం కనిపిస్తోంది. అయితే, కేవలం గుడి కట్టడం మాత్రమే కాదు, గుండెల్లో రామతత్వాన్ని నింపుకోవడమే అసలైన భక్తి. అరాజకం నశించి, శాంతి సౌభాగ్యాలు వెల్లివిరిసేలా.. రాముడు నడిచిన దారిలో మన అడుగులు పడాలి. అప్పుడే ఈ నేల నిజంగా 'రాముడు ఏలిన నేల'గా మళ్లీ వెలుగుతుంది.

రామరాజ్యంలో అత్యంత కీలకమైన అంశం పాలకుడు ప్రజలకు జవాబుదారీగా ఉండటం. ఒక సామాన్య పౌరుడు లేవనెత్తిన విమర్శను కూడా రాముడు గౌరవించి, తన వ్యక్తిగత సుఖాన్ని త్యాగం చేశాడు. నేటి ప్రజాస్వామ్యంలో కూడా పాలకులకు విమర్శలను స్వీకరించే సహనం, పారదర్శకత అత్యవసరం. రాముడు అడవిలో ఉన్నప్పుడు గుహుడు (బోయవాడు), హనుమంతుడు (వానరుడు), జటాయువు (పక్షి), విభీషణుడు (రాక్షస వంశం) వంటి భిన్న నేపథ్యాలు కలిగిన వారందరినీ అక్కున చేర్చుకున్నాడు. ఇది నేటి సామాజిక సమరసతకు నిదర్శనం.



కుల, మత, వర్గ విభేదాలు లేని సమాజ నిర్మాణమే రామరాజ్య లక్ష్యం. రాముడి పాలనలో వ్యాధులు, అకాల మరణాలు, దారిద్ర్యం లేవని రామాయణం చెబుతుంది. నేటి ప్రభుత్వాలు ప్రవేశపెడుతున్న సార్వత్రిక ఆరోగ్య పథకాలు, పేదరిక నిర్మూలన కార్యక్రమాలు ఈ రామరాజ్య స్ఫూర్తితో సాగవలసినవే. రావణ సంహారం వెనుక ఉన్న ప్రధాన ఉద్దేశ్యం స్త్రీ గౌరవాన్ని కాపాడటం. ఏ దేశంలో స్త్రీలు గౌరవించబడతారో అక్కడ దేవతలు కొలువై ఉంటారన్న సూత్రం రామరాజ్యంలో అక్షరాలా అమలు జరిగింది. నేటి సమాజంలో మహిళా భద్రత అనేది ప్రాధాన్య అంశం కావాలి. ప్రకృతిని, పశు పక్షాదులను రాముడు అమితంగా ప్రేమించాడు. వానర సైన్యంతో కలిసి సముద్రంపై వారధి నిర్మించినా, అడవుల్లో సంచరించినా ప్రకృతికి హాని చేయలేదు. నేటి పర్యావరణ మార్పుల తరుణంలో రామరాజ్యంలోని ప్రకృతి ప్రేమే మనకు రక్ష. చట్టం ముందు అందరూ సమానులే అనే భావన రామరాజ్యంలో కనిపిస్తుంది. శిక్షలు కఠినంగా కాకుండా, నేరస్తుడిలో మార్పు తెచ్చేలా ఉండేవని పురాణాలు చెబుతున్నాయి. రామరాజ్యం అంటే ఏదో ఒక మతానికి సంబంధించింది కాదు. అది ఒక నైతిక వ్యవస్థ. పాలకుడు 'సేవకుడిలా' భావించినప్పుడే, ప్రజల కళ్లలో ఆనందం చూసినప్పుడే అది నిజమైన రామరాజ్యం అవుతుంది.




# అవగాహనతోనే 'మూర్ఛ'పై గెలుపు!

**(..నేడు పర్పుల్ డే - మూర్ఛ వ్యాధి అవగాహన దినోత్సవం..)**

ప్రతి ఏటా మార్చి 26వ తేదీని ప్రపంచవ్యాప్తంగా 'పర్పుల్ డే'గా పాటిస్తారు. మూర్ఛ వ్యాధి పట్ల సమాజంలో ఉన్న అపోహలను తొలగించి, బాధితులకు అండగా నిలవడమే ఈ రోజు ప్రధాన ఉద్దేశ్యం. 2008లో కెనడాకు చెందిన కాసిడీ మేగాన్ అనే తొమ్మిదేళ్ల చిన్నారి తనలాంటి మూర్ఛ రోగులు ఒంటరి వారు కాదని చాటిచెప్పడానికి ప్రారంభించిన ఈ చిన్న ప్రయత్నం, నేడు అంతర్జాతీయ ఉద్యమంగా మారింది.

ప్రపంచవ్యాప్తంగా దాదాపు 5 కోట్ల మంది మూర్ఛతో బాధపడుతున్నారు. వైద్యశాస్త్రం ఇంతగా అభివృద్ధి చెందినప్పటికీ, నేటికీ మూర్ఛను ఒక శాపంగానో లేదా దయ్యం పట్టినట్టుగానో భావించే వారు ఉండటం విచారకరం. నోట్లో తాళం చెవులు పెట్టడం, ఇనుప వస్తువులు చేతికి ఇవ్వడం వంటి పాత పద్ధతులు బాధితులకు మేలు చేయకపోగా, మరింత హాని కలిగిస్తాయి. మూర్ఛ అనేది మెదడులోని నరాల వ్యవస్థలో వచ్చే చిన్నపాటి విద్యుత్ అంతరాయం మాత్రమేనని గుర్తించాలి. మూర్ఛ వ్యాధిగ్రస్తులు సాధారణ జీవితాన్ని గడపగలరు. సరైన సమయంలో వైద్యం, క్రమం తప్పకుండా మందులు వాడితే 70 శాతం మందిలో ఈ సమస్యను అదుపు చేయవచ్చు. సమాజం చేయాల్సింది వారిని చూసి భయపడటం కాదు, వారికి భరోసానివ్వడం. అందుకే ఈ రోజు అందరూ 'పర్పుల్' (ఊదా) రంగు దుస్తులు ధరించి, ఈ వ్యాధి పట్ల అవగాహన కల్పిస్తారు. మూర్ఛ కేవలం శారీరక సమస్య మాత్రమే కాదు, అది బాధితుల మానసిక ధైర్యాన్ని కూడా దెబ్బతీస్తుంది. సరైన ప్రాథమిక చికిత్సపై అవగాహన పెంచుకోవడం, బాధితుల పట్ల వివక్ష చూపకపోవడమే మనం వారికి ఇచ్చే నిజమైన మద్దతు.

మూర్ఛ అనేది అంటువ్యాధి కాదు. బాధితులతో కలిసి భోజనం చేయడం, వారితో స్నేహం చేయడం వల్ల ఎటువంటి ప్రమాదం ఉండదు.  మూర్ఛ వ్యాధి ఉన్నవారు కూడా సాధారణ జీవితాన్ని గడపగలరు, ఉద్యోగాలు చేయగలరు, పెళ్లిళ్లు చేసుకోగలరు. వారికి కావాల్సింది జాలి కాదు, సమాన గౌరవం. సరైన సమయంలో న్యూరాలజిస్ట్‌ను సంప్రదించి, క్రమం తప్పకుండా మందులు వాడితే 70 శాతం మందిలో మూర్ఛను పూర్తిగా అదుపు చేయవచ్చు. 'మూర్ఛ వ్యాధి ఒక శాపం కాదు, అది మెదడుకు సంబంధించిన చిన్న అనారోగ్యం మాత్రమే. అపోహలను వీడుదాం, అవగాహన పెంచుదాం. మూర్ఛ బాధితుల పట్ల వివక్షను వదిలి, వారికి అండగా నిలుద్దాం'

**- డాక్టర్ పరశురాం, హైదరాబాద్**

**రచయితలకు ఆహ్వానం!**

సమాజాన్ని మేల్కొల్పుదామా..
యువతకు మార్గం చూపుదామా..
విద్యార్థులకు మార్గదర్శనం చేద్దామా..
న్యాయ, వైద్య సలహాలు చెబుదామా..
వ్యాపార మెలకువలు నేర్పుదామా..
మీ జ్ఞానాన్ని పంచే ఆలోచనతో ఉన్నారా..

అయితే, మీ రచనలకు పదును పెట్టండి..
మీ అభిప్రాయాలను రాతగా మార్చండి..
'ప్రజావాణి' వేదికగా ప్రజలకు దగ్గరవ్వండి..
నేటి 'ఈవార్తలు' పత్రికతో మమేకమవ్వండి..
కథలు, కవితలు, వ్యాసాలు ఏవైనా..
మీ సొంత సమాచారం.. మీ బైలైన్‌తో..!

పంపాల్సిన చిరునామా:
మెయిల్: contact@evarthalu.com
వాట్సాప్ నంబర్: 9440455811

This newspaper is Owned and Published by **BOMMAKANTI SHRAVAN KUMAR** from H.No.4-36, Balwanthapoor, Mallial, Jagitial District, Telangana, 505452, Phone Number: 9440455811. Edited by **BOMMAKANTI SHRAVAN KUMAR** and Printed by M/s Kakatiya Printers at #2-24-96/9, Near Sri Krishna Pharma, Laxminarayana Nagar, Ida Uppal, Medchal Malkajgiri District, Telangana, 500039. Corporate Office: #1-5-431/20/4, GS Pride, Plot No.4, Jonnabanda, Old Alwal, Medchal Malkajgiri District, Telangana, 500010. Landline: 040-35673004.